# రైతుల కరెంటు కట్ చేసిన రేవంత్ అధికారాన్ని రైతులే కట్ చేస్తారు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

- **తెలంగాణకు శనిలా కాంగ్రెస్ సర్కార్ - వెయ్యి రోజుల అసమర్థ పాలనపై బీఆర్ఎస్ భారీ నిరసన**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 05 (వుదయం బ్యూరో):**





రైతులకు కరెంటు కట్ చేసి కష్టాలకు గురి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారాన్ని కట్ చేసేందుకు రైతులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రైతుల పాలిట శనిలా, సన్యాసి సర్కార్ గా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల అసమర్థ పాలనకు నిరసనగా బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శనివారం నాగర్ కర్నూల్ లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. వెలమ ఫంక్షన్ హాల్ నుంచి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సబ్ స్టేషన్ వరకు సుమారు 200 ట్రాక్టర్లతో రైతులు భారీ ర్యాలీగా తరలివచ్చారు. ట్రాక్టర్ పై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ప్రయాణిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టి విద్యుత్ శాఖ ఎస్ఈ కి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో విత్తనాలు, ఎరువులు, రైతుబంధు, రైతుబీమా, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు, బోనస్ వంటి బృహత్తర కార్యక్రమాలు అమలు చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ చరిత్రలో కేసీఆర్ మొనగాడుగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఇచ్చిన వసతులు రేవంత్ రెడ్డి ఎందుకు ఇవ్వడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారన్నారు. తాము ఇంతకంటే గొప్పగా రేవంత్ ఇస్తాడని నమ్మి మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

కృష్ణా, గోదావరి నదుల్లో సమృద్ధిగా నీరు ఉన్నా ఎత్తిపోతల ద్వారా నీటిని ఎత్తిపోయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే నేడు తెలంగాణ రైతుల కొంప ముంచిందన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉంటాయని, కరువు వస్తుందని శాస్త్రవేత్తలు, ప్రతిపక్షాలు పదేపదే హెచ్చరించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఎగువ కర్ణాటకలో భారీ వర్షాలతో కృష్ణా నదికి రోజూ లక్షా 50 వేల క్యూసెక్కుల వరద వస్తున్నా కల్వకుర్తి ఎత్తిపోతల మోటార్లను ప్రారంభించాలని ఎంత చెప్పినా వినలేదన్నారు. 200 రోజులు మోటార్ నడిపితే 40 టీఎంసీల నీరు ఎత్తిపోయడం సాధ్యమవుతుందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. నీరు ఇస్తే ఎరువులు, విద్యుత్, రైతు భరోసా, మద్దతు ధర ఇవ్వాల్సి వస్తుందని కుట్రపూరితంగా నీరు ఇవ్వలేదని ఆరోపించారు.

నాడు ఆంధ్ర ప్రదేశ్ ప్రయోజనాలకు అనుగుణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను నిర్మించి తెలంగాణకు ద్రోహం చేశారని, నేడు కూడా ఆంధ్ర నీటి దోపిడీ కొనసాగుతోందన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 854 అడుగుల నుంచి నీటిని తీసుకుపోతుంటే, మరో ప్రాజెక్టు వెలుగొండను 840 అడుగుల నుంచి నీటిని తరలించేలా ఆంధ్ర సర్కార్ నిర్మించి నీటిని తరలించుకుపోతున్నా రేవంత్ సర్కార్ కళ్లు అప్పగించి చూస్తోందన్నారు. ఆంధ్రకు నీటిని దోచిపెడుతున్నారని మండిపడ్డారు. యూరియా యాప్ లతో మోసం చేసిన కాంగ్రెస్ నేతల ఈపులు పగలగొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. నాగర్ కర్నూల్ లో ఎరువు కోసం నమోదు చేసుకుంటే వనపర్తి, జడ్చర్ల, కల్వకుర్తికి వెళ్లి తెచ్చుకోవాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ హయాంలో ఆటో వాడికి డబ్బులు ఇస్తే యూరియా ఇంటికి వచ్చేదని, నేడు 250 రూపాయల బస్తా కోసం కిలోమీటర్లు తిరగాల్సిన దుస్థితి కాంగ్రెస్ అసమర్థ పాలనకు పరాకాష్ట అన్నారు. ఎరువులు ఇవ్వలేని కాంగ్రెస్ సర్కార్ కు రైతులు పిండాకూడు పెట్టేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

సీఎంకు మంత్రులకు మధ్య సఖ్యత లేదని, ముఖ్యమంత్రికి మంత్రికి పడకపోతే మంత్రికి ముఖ్యమంత్రికే పడని వ్యవహారం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రేవంత్ కు ఢిల్లీ పర్యటనలు తప్ప పాలనపై పట్టు లేదని, ప్రజల బాగోగులు పట్టించుకునే సమయం కూడా లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలా వద్దా అని ప్రజాభిప్రాయం పెడితే ఖేల్ ఖతం అవుతుందన్నారు.

**సీఎం 420 హామీలు హామీలే: మర్రి జనార్దన్ రెడ్డి**

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ 6 గ్యారంటీలు, 420 హామీలతో ఒక్కటి సక్రమంగా నెరవేర్చని రేవంత్ 420 సీఎం గా నిలిచారన్నారు. ప్రజలకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేస్తున్నారన్నారు. కేసీఆర్ ను తిట్టడం తప్ప మూడేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నోరు తెరిస్తే నంది, పంది అనే మాటలు తప్ప ముఖ్యమంత్రికి వేరే మాట రాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే యూరియా యాప్ ను మూసీ నదిలో పడేస్తామన్నారు. బస్టాండ్ కూడలిలో ఉట్టికి యూరియా బస్తాలు కట్టి రైతులు పడుతున్న కష్టాలను కండ్లకు కట్టినట్లు ప్రదర్శించడం ఆకట్టుకుంది. ఈ ప్రదర్శన కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిలువుటద్దంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్లెమింగ్ కంపెనీ సేవలు అభినందనీయం

- **పెద్ద గొట్టిముక్కుల సర్పంచ్ నవీన్...**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 5.....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని పెద్ద గొట్టుముక్కల ZPHS పాఠశాలకు ఫ్లెమింగ్ కంపెనీ యాజమాన్యం 4 లక్షల విలువ చేసే 60 డెక్స్ బెంచ్ లను డొనేట్ చేశారు. మండల పరిధిలోని ఫ్లెమింగ్ కంపెనీ యాజమాన్యం ఈరోజు పెద్ద గొట్టుముక్కల గ్రామంలోని హై స్కూల్ పాఠశాలకు 60 డెక్స్ బెంచ్ లను డొనేట్ చేశారు వీటి విలువ సుమారు నాలుగు లక్షలు ఉంటుందని స్థానిక సర్పంచ్ నవీన్ తెలిపారు. వీటిని నేడు పాఠశాలకు శనివారం ఉదయం 60 డెక్స్ బెంచ్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్లాడి ఆంజనేయులు. హెచ్ఎం సురేష్. ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మానస. వార్డు సభ్యులు అల్లాడి వీరేశం. బేరి సాయికుమార్. కాళ్ళ హరీష్. నాయకులు మురళీ మనోహర్ రెడ్డి. వీరారెడ్డి. ప్రభాకర్ రెడ్డి. పోచయ్య. ఛత్రి గణేష్. సెక్రటరీ శ్రీకాంత్. పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ యువకులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ లో S I R కు సంబంధించిన నోటీసుల సవరణ



- **పర్యవేక్షించిన డిప్యూటీ తాసిల్దార్.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 5.....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో నేడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన S IR ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా నేడు శివ్వంపేట ఆర్ ఐ కవిత సమక్షంలో నోటీసులను సవరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని శివ్వంపేట డిప్యూటీ తాసిల్దార్ వాషిర్ హుసేన్ విచ్చేసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఓటు ఎంతో విలువైనదని. అర్హుడైన ఏ ఒక్క ఓటర్ కూడా నష్టపోకూడదని అత్యంత బాధ్యతగా అప్రమత్తంగా పనిచేస్తున్నామని తెలిపారు. తిమ్మాపూర్ బూత్ కు సంబంధించిన ఎన్ని నోటీసులు వచ్చాయి వాటికి సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటి అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. సంబంధిత ఓటర్ తో వెరిఫికేషన్ సక్రమంగా నిర్వహించి అవసరమైన వివరాలను పూర్తిగా పరిశీలించిన అనంతరం ఫార్ములాను ఎలాంటి తప్పులు లేకుండా నిబంధనల ప్రకారం పూర్తి చేస్తున్నామని వారు వివరించారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతి యువకులు ఓటర్ నమోదు చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ అంగన్వాడీ టీచర్ రేణమ్మ. పంచాయతి సెక్రటరీ. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 6 గ్యారంటీలు ఎక్కడ..? హామీలు ఏమయ్యాయి..?

- **1000 రోజుల కాంగ్రెస్ పాలనపై అయిజలో బీఆర్ఎస్, విద్యార్థుల భారీ నిరసన**

**అయిజ సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా అయిజ పట్టణ కేంద్రంలో భారీ నిరసన నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులు, విద్యార్థులను మోసం చేస్తోందని ఆరోపించారు. యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలు, విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ మాస్టర్ మధు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు నాగిరెడ్డి వెంకట రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 1000 రోజులు కావస్తున్నా హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# మల్దకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం

- **విద్యార్థులే అధికారులుగా మారి స్వయం పరిపాలన దినోత్సవం**

**మల్దకల్లు సెప్టెంబర్ 05 (వుదయం కరస్పాండెంట్)**




జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మల్దకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. హృదయ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులతో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాత్రలను పోషిస్తూ కళాశాల పరిపాలనను నిర్వహించారు. తరగతులను సైతం నిర్వహించిన విద్యార్థులు బోధన, పరిపాలనా విధానాలను ప్రత్యక్షంగా అనుభవిస్తూ ఉత్సాహంగా నేర్చుకున్నారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులర్పించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. హృదయ రాజు, ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి, అధ్యాపక బృందాన్ని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా డీఐఈఓ ఎం. హృదయ రాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితానికి సరైన మార్గదర్శకత్వం అందించేది ఉపాధ్యాయుడేనని అన్నారు. గురువులు చూపిన సన్మార్గంలో నడుస్తూ సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా విద్యార్థులు ఎదిగినప్పుడే ఉపాధ్యాయులకు నిజమైన గౌరవం ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకుని జీవితంలో రాణించాలనే ఆకాంక్షతో పనిచేసే వ్యక్తి ఉపాధ్యాయుడని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆన్‌లైన్‌లో ఎంత సమాచారం అందుబాటులో ఉన్నప్పటికీ, దానిని సరైన విధంగా ఎలా వినియోగించాలో మార్గనిర్దేశం చేసేది గురువేనని తెలిపారు. గురువు లేని విద్య గమ్యం లేని ప్రయాణం వంటిదని పేర్కొన్నారు. వివిధ పాత్రలు పోషించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించి ప్రశంసాపత్రాలతో పాటు పెన్నులను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు, రామాంజనేయులు గౌడ్, భాగ్యలక్ష్మి, గోవర్ధన్ శెట్టి, మాధురి, శ్రీకాంత్, సుధాకర్, ఇఫ్తికార్, కమలహాసన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సువర్ణమ్మతో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో అండగా సీఎం సహాయనిధి



- **ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని చందుబట్ల గ్రామానికి చెందిన నల్లగంటి బాలనాగయ్య భార్య ఎల్లమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును శనివారం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అందజేశారు. గ్రామ సర్పంచ్ మడ్డి తిరుపతిగౌడ్ తో కలిసి లబ్ధిదారురాలికి చెక్కును అందించారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని గ్రామస్థులు తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# కీర్తిశేషులు స్వర్గీయ ప్రసాద్ గౌడ్ కు ఘన నివాళి....

- **బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 5....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు స్వర్గీయ పెదగౌని జిన్నారం ప్రసాద్ గౌడ్ 57వ జయంతి సందర్భంగా గూడూరు గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. మండల కేంద్రమైన శివంపేట గ్రామపంచాయతీ మాజీ సర్పంచి మాజీ ఎంపీటీసీ స్వర్గీయ పెద్ద గౌని జిన్నారం ప్రసాద్ గౌడ్ 57వ జయంతి వేడుకలు మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమణ గౌడ్ గ్రామస్తులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు స్వర్గీయ పెద్ద గౌని జిన్నారం ప్రసాద్ గౌడ్ చేసిన సేవలు శిరస్మరణీయమని ఆయన తెలిపారు. ప్రసాద్ గౌడ్ మా మేనమామ ఆయన పేరుమీద ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మా పెద్దమామయ్య హైకోర్టు న్యాయవాది ప్రముఖ సంఘ సేవకులు ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్ద గౌని జిన్నారం శివకుమార్ గౌడ్ చేస్తున్న సేవలు వర్ణనాతీతమని పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పెన్నులు చండీ గ్రామంలో ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు పేర మినరల్ వాటర్ ప్లాంట్. కస్తూరిబా బాలికల పాఠశాలలో చుట్టూరుగా సోలార్ పెన్షన్. సీసీ కెమెరాలు. పిల్లలకు కావలసిన వసతులు కల్పించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు వారికి కావలసిన లాప్టాప్ లు. వృద్ధులకు దుస్తులు. పేద మహిళలకు కుట్టు మిషన్లు. ఇలాంటి అనేక సేవలు అందించారు. ప్రసాద్ గౌడ్ సర్పంచ్ గా ఉన్నప్పుడు ఆయన హాస్పిటల్ లో చికిత్స పొందుతూ చివరి శ్వాసలో ఉన్నప్పుడు కూడా పేద ప్రజల రేషన్ కార్డులు వారి యొక్క అవసరాలను గుర్తు చేస్తూ తుది శ్వాస విడిచారని ఆయన తెలిపారు. ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ పేర చేస్తున్న సేవలు మా పెద్దమామయ్య శివకుమార్ గౌడ్ తన సోదరులు అశోక్ గౌడ్. ప్రసాద్ గౌడ్ లు స్వర్గస్తులై 22 సంవత్సరాలు అయినప్పటికీని వారి గుర్తులు నేటికీ చెదరకుండా తన గుండెల్లో దాచుకుని వారి పేర సేవలందిస్తూ వారి జ్ఞాపకాలను కొనసాగిస్తురని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వరాజ్ లక్ష్మి శ్రీనివాస్ గౌడ్. సర్పంచ్ బ్యాగరీ నరసయ్య. ఉప సర్పంచ్ వెంకటేష్గౌడ్. మురళి. నాగభూషణం. మాజీ ఉపసర్పంచ్ శరన్ సత్తయ్య. మౌజం. బ్యాగరి సాయిలు. బ్యాగరీ యాదగిరి. గూడెపు రాజు కాజా. వార్డు సభ్యులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చదువుకు చేయూత.. భవితకు బాట!

- **ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాదరక్షల పంపిణీ**
- **జిల్లెడబండ గ్రామపంచాయతీ పరిధిలో విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం**

**గద్వాల సెప్టెంబర్ 05 (వుదయం బ్యూరో)**






పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు.. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకూడదు.. ప్రతి చిన్నారి సమాన అవకాశాలతో ముందుకు సాగాలనే సంకల్పంతో జిల్లెడబండ గ్రామపంచాయతీ పరిధిలో విద్యార్థులకు అండగా నిలిచే కార్యక్రమం నిర్వహించారు. జిల్లెడబండ, మర్లపల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాదరక్షలను పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారి చదువుకు ప్రత్యక్షంగా చేయూత నందించడంతో పాటు, "మీ వెనుక మేమున్నాం" అనే భరోసాను కల్పించారు. ఏకరూప దుస్తులు, పాదరక్షలు అందుకున్న విద్యార్థుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ డి. నాగేష్ నాయుడు, గ్రామపం చాయతీ కార్యదర్శి ఇ. కవిత, గ్రామీణాభివృద్ధి సంస్థ సమన్వయకర్త జయన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, అంగన్వాడీ ఉపాధ్యాయులు అరుణ దేవి, ప్రశాంతి, గ్రామ సంస్థ సహాయకుడు లక్ష్మణ్ తో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారుల చదువుకు.. సమాజం తోడుగా! ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్య తగా భావించాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు గర్వంగా వెళ్లాలి.. చదువుపై పూర్తి దృష్టి పెట్టాలి.. తన ప్రతిభను చాటుకునేందుకు సమాన అవకాశాలు పొందాలి అనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులపై చేసే ప్రతి చిన్న సహాయం భవిష్యత్తులో సమాజానికి గొప్ప ఫలితాన్ని అందిస్తుందని, నేటి పిల్లలే రేపటి గ్రామానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. చదువే ఆయుధం.. భవిష్యత్తే లక్ష్యం! పాఠశాల దశలో విద్యార్థులకు అందించే ప్రోత్సాహం వారి వ్యక్తిత్వ వికాసంపై చెరగని ముద్ర వేస్తుంది. అందుకే విద్యార్థుల విద్యాభివృద్ధికి కుటుంబంతో పాటు గ్రామ సమాజం కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల అభివృద్ధి జరిగితేనే గ్రామాభి వృద్ధి సాధ్యం.. పిల్లల భవిష్యత్తు బలపడి తేనే సమాజం బలపడుతుంది అనే సందేశాన్ని ఈ కార్యక్రమం బలంగా చాటిచెప్పింది. మన పిల్లల చదువుకు మనమే అండ.. వారి భవిష్యత్తుకు మనదే బాధ్యత!

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి)**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపిక అయిన ఉపాధ్యాయులను శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు మెమెంటోస్ సర్టిఫికెట్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీ టిడిపి మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గ మాజీ ఉపాధ్యక్షుడు రాములు యాదవ్ పాల్గొన్నారు.



# లోక్ అదాలత్ పై అవగాహనకు శ్రీకారం

- **లోక్ అదాలత్ పై అవగాహనకు శ్రీకారం**
- **12న జాతీయ లోక్ అదాలత్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 05 (వుదయం బ్యూరో):**

జాతీయ లోక్ అదాలత్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.

రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 12న జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ప్రచార పోస్టర్ ను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, డీఎల్ఎస్ఏ చైర్మన్ డి. రమాకాంత్ శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆవిష్కరించారు.

'రాజీ మార్గమే రాజమార్గం' అనే సందేశంతో రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణ ద్వారా కక్షిదారులు రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకునే అవకాశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సందర్భంగా జడ్జి డి. రమాకాంత్ మాట్లాడుతూ భూ తగాదాలు, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, కుటుంబ వివాదాలు, మోటారు వాహన ప్రమాద కేసులతో పాటు బ్యాంకు, ఇతర పెండింగ్ కేసులను లోక్ అదాలత్ లో ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు.

లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభించడంతో సమయం, డబ్బు ఆదా అవుతాయని, అప్పీల్ కు అవకాశం లేని తుది పరిష్కారం పొందవచ్చని తెలిపారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా కక్షిదారులు సయోధ్యకు ముందుకు వచ్చి తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ ద్వారా కక్షలు, ప్రతీకారాలు తగ్గి మానవ సంబంధాలు బలపడతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ జడ్జి నసీం సుల్తానా, డీఎల్ఎస్ఏ సెక్రటరీ నిహారిక, సీనియర్ సివిల్ జడ్జి గోపిక నాగశ్రావ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శృతి దూత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువతకు ఉచిత వృత్తి శిక్షణ

- **భోజనం, వసతితో శిక్షణ.. అనంతరం ఉద్యోగ అవకాశం**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 05 (వుదయం బ్యూరో):**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (DDUGKY) ద్వారా జలాల్ పూర్ లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో గ్రామీణ యువతీ యువకులకు ఉచిత వృత్తి శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డా. ఎన్. కిషోర్ రెడ్డి తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించడంతో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కోర్సులు: అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ (ట్యాలీ ప్రైమ్), సోలార్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ (హోమ్ అప్లయిన్సెస్, మోటార్ వైండింగ్, హౌస్ వైరింగ్), ఆటోమొబైల్ టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, మొబైల్ టెక్నీషియన్ సీసీటీవీ ఇన్ స్టాలేషన్, కంప్యూటర్ హార్డ్ వేర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిజిటల్ మిత్ర) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్సును బట్టి శిక్షణ వ్యవధి 3 నుంచి 4 నెలలు ఉంటుంది. వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. బీకాం, ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్హతలను బట్టి వివిధ కోర్సులకు అర్హత ఉంటుంది. ప్రవేశాలు సెప్టెంబర్ 16న నిర్వహించనున్నట్లు సంస్థ తెలిపింది. అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోలు తీసుకుని సంస్థలో హాజరు కావాలని సూచించింది. దిల్ సుఖ్ నగర్, హయత్ నగర్ నుంచి 524 బస్సు సౌకర్యం ఉంది. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్లను సంప్రదించాలన్నారు.

## 6న భారీ బైక్ ర్యాలీ - పిలుపునిచ్చిన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, సెప్టెంబర్ 04: (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రములో ప్రజా ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల విజయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అచ్చంపేట నియోజకవర్గంలో సెప్టెంబర్ 6న భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శనివారం ప్రకటనలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు.

హాజీపూర్ నుండి అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ మహా బైక్ ర్యాలీ జరుగుతుందని, ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని, అచ్చంపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే ఈ ర్యాలీ లక్ష్యమని తెలిపారు. సెప్టెంబర్ 6, ఆదివారం హాజీపూర్ అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తా

### అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా
## నమోదు కావాలి : ఆర్డీవో కృష్ణవేణి



తాడ్వాయి, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి కోరారు. శనివారం ఆమె విందరావుపేట, చల్వాయి, తాడ్వాయి, కాటాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ముసాయిదా జాబితాలను అందుబాటులో ఉంచి, నమోదు, తొలగింపులు, వివరాల సవరణలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాలు సెప్టెంబర్ 6, 12, 13 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో BLOలు అందుబాటులో ఉంటారు.

దరఖాస్తు

ఫారం-6 నూతన ఓటరు నమోదుకు

ఫారం-7 జాబితా నుంచి పేరు తొలగింపుకు ఫారం-8 వివరాల సవరణకు

అర్హత 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజా భాగస్వామ్యంతోనే తప్పులులేని సమగ్ర ఓటర్ల జాబితా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.సృజన్ కుమార్, ఎన్నికల డిటి నిరీష్, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా
## సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులు



తొర్రూరు సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి): ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకొని తొర్రూరు మండల విద్యా వనరుల కేంద్రంలో ఉన్న భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి శ్రీ యం బుచ్చయ్య గారు మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థుల్లో జ్ఞానం, నైతిక విలువలు, క్రమశిక్షణను పెంపొందించడంలో ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు జనార్దన్, శ్రీనివాస్, ముత్యలింగం, చంద్రమౌళి తిరుమలేష్, ఉప్పలయ్య, సురేందర్, అనిల్ కుమార్, చైతన్య, కృష్ణ,దుర్గా హరిస్సేన్, మల్లేశం భాస్కర్, రవి తదితరులు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ గారికి నివాళులర్పించారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు నోట్ బుక్స్ పంపిణీ. చీర్స్ ఫౌండేషన్ అధినేతని సన్మానించిన సర్పంచ్.**

**ఖానాపురం, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):**



చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను నోట్ బుక్స్ ను చీర్స్ ఫౌండేషన్ అధినేత బత్తిని అశోక్,గ్రామ సర్పంచ్ సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు మాధవాలు వెంకన్న, హై స్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో కలిసి పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని దర్శనంపేట గ్రామంలోని హైస్కూల్,ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ గ్రామ సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చీర్స్ ఫౌండేషన్ అధినేత అశోక్ ను శాలువాతో ఘనంగా సర్పంచ్, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజకులుగా తీర్చిదిద్ది భావితరాల భవిష్యత్ ... ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొనుకటి మోహన్, చీర్స్ ఫౌండేషన్ బృందం బత్తిని యాదగిరి, బత్తిని ఉమేష్, హై స్కూల్,ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## సుభాష్ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు రాజు



ఖానాపురం, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి): మండల కేంద్రంలోని సుభాష్ ట్రాక్టర్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా కలకోట రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సుభాష్ ట్రాక్టర్ యూనియన్ బాధ్యులు తెలిపారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. సుభాష్ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు కలకోట రాజు, ఉపాధ్యక్షుడు రాగం శ్రీను, కోశాధికారి కదురూరి రంజిత్, కార్యదర్శి మర్రి శ్రావణ్, ముఖ్య సలహాదారుడు పెండెం శోభన్ తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ ట్రాక్టర్ యూనియన్ బాధ్యులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

### సొసైటీ చైర్ పర్సన్ ను సన్మానించిన
### యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు



ఖానాపురం, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్ వల్లే శ్రీనివాస్ యాదవును యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ సొసైటీ కార్యాలయంలో చైర్ పర్సన్ ను శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిండికుమార్ యాదవ్, భాషబోయిన వెంకటేష్ యాదవ్, నాంచారి కుమారస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కూడా చైర్‌పర్సన్ ను పూలమొక్క,
## శాలువాతో సత్కరించిన మామిండ్ల రాజు



హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) : కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్ పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గుండు సుధారాణికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం కూడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, 31వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుండు సుధారాణికి పూల మొక్కను బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సుపరిపాలన అందించాలని మామిండ్ల రాజు ఆకాంక్షించారు.

## గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన



నర్సంపేట సిడిపిఒ మధురిమ. ఖానాపురం, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి): మండలంలోని బుధరావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయినపల్లి అంగన్వాడి సెంటర్ లోని పోషణ మాస కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలను, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించినట్లు నర్సంపేట సిడిపిఓ మధురిమ తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అంగన్వాడి నుంచి అందజేసే గుడ్లు పాల ప్యాకెట్లు బాలామృతం అందజేసినట్లు తెలిపారు. గర్భిణీ స్త్రీలకు బాలింతలకు శుభ్రత పరిశుభ్రత తో పాటు పలు విషయాలపై అవగాహన కల్పించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి, సిడిపిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, అంగన్వాడి సూపర్వైజర్ రమా, అంగన్వాడి టీచర్ పద్మ, ఆయా శోభ, ఆశా కార్యకర్త, గర్భిణీ స్త్రీలు బాలింతలు అంగన్వాడి పిల్లలు పాల్గొన్నారు.

## పాకాల సరస్సుకు గోదావరి నీళ్లను తెచ్చిన
## దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది విగ్రహం పెడితే తప్పేంటి...

**విగ్రహ ఏర్పాటు కోసం నిర్మాణం చేస్తున్న గద్దెని కూల్చడం దుర్మార్గం. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే డివిజన్ వ్యాప్తంగా ఊరూర పెద్ది విగ్రహాలను ఏర్పాటు చేస్తాం. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.**

**ఖానాపురం, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):**



పాకాల సరస్సులోకి గోదావరి నీళ్లు రావాలనే ఈ ప్రాంత రైతాంగ ప్రజల మహిళల గత దెబ్బై 80 సంవత్సరాల చిరకాల వాంఛను నెరవేర్చిన మహనీయుడు దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తప్పేంటి అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రభుత్వాన్ని ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతిని డిమాండ్ చేశారు. మండలంలోని అశోక్ నగర్ గ్రామంలో ముందస్తుగా గ్రామపంచాయతీకి దరఖాస్తు పెట్టుకొని గతంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ జెండా గద్దె ప్లేస్ లోనే ప్రస్తుతం దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కోసం పార్టీ జెండా గద్దెని తీసి విగ్రహం పెట్టడానికి నిర్మాణం చేస్తున్న నూతన గద్దె నిర్మాణాన్ని అర్ధరాత్రి దొంగల్లాగా ప్రభుత్వము పోలీస్ అధికారుల సమక్షంలో విగ్రహ ఏర్పాటు కోసం నిర్మాణం చేసిన గద్దెలను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చడంపై మాజీ మంత్రి ప్రభుత్వంపై నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి పై పోలీసు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడ్డ దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్దిని పెద్ది జ్ఞాపకాలను ఈ ప్రాంత ప్రజల రైతుల మహిళల యువకుల చిన్నల పెద్దల గుండెలలో ఉన్న జ్ఞాపకాలను ఇలాంటి తుగ్లక్ కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ ప్రాంత నియోజకవర్గ ఎమ్మెల్యే తదితరులు పైశాచిక ఆనందం పొందుతారే తప్ప ప్రజల మనసులో నుంచి పెద్ది జ్ఞాపకాలను ఎవరు తీసివేయలేరని కాంగ్రెస్ ప్రభుత్వాని నియోజకవర్గ ఎమ్మెల్యేలను హెచ్చరించారు. ప్రభుత్వంగానీ నియోజకవర్గ ఎమ్మెల్యేగాని ఈ ప్రాంత అభివృద్ధికి పోటీ పడాలి తప్ప చనిపోయిన వ్యక్తి విగ్రహం ఏర్పాటు కోసం నిర్మాణం చేసే గద్దెలను కూల్చడం సిగ్గుచేటు అన్నారు. ఏది ఏమైనా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే కెసిఆర్ ఏ ముఖ్యమంత్రి అని తెలుపుతూ, ప్రజల శాంతి భద్రతలు కాపాడే పోలీసులు కూడా పక్షపాత ధోరణి వహించకుండా సమన్వయం పాటించాలని తెలుపుతూ, ఈ ప్రాంత రైతన్నల పంట పొలాలు రెండు పంటలు పండే విధంగా పాకాల సరస్సులోకి గోదావరి జలాలను తీసుకువచ్చిన దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది విగ్రహ ఏర్పాటు కోసం స్వచ్ఛందంగా గ్రామస్తులు నాయకులు గ్రామంలో అనుమతులతో గద్దెనిర్మానాన్ని చేసుకుంటుండగా అర్ధరాత్రి పోలీసుల సమక్షంలో గద్దెను ధ్వంసం చేయడం కులగొట్టిన గద్దెను పరిశీలించడానికి

ఒక మాజీ మంత్రి వస్తున్నాడనే సమాచారంతో ప్రభుత్వం ఎక్కడికి ఎక్కడ పోలీసులను మోహరించి పరిశీలనకు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయడం విడ్డురంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా మరి ఎక్కడైనా ఉన్నామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హెచ్చరించారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంతకు రెండింతలను కాంగ్రెస్ పార్టీవారు అనుభవించే విధంగా చేసి చూపిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యేను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాయుడి రవీందర్ రెడ్డి, డివిజన్ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్ రావు, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ ఓడిసిఎంఎస్ఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి నాయక్, మాజీ జడ్పిటిసి బత్తిని స్వప్నశ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రామ సహాయం ఉమారాణిఉపేందర్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోరే సుధాకర్, సర్పంచ్ కూస విమలలింగ మూర్తి, గ్రామ పార్టీ అధ్యక్షులు ముచ్చా యాదగిరిరావు, మచ్చిక అశోక్ గౌడ్, ఎస్ కే యాకుబ్ పాషా, నాయకులు ముద్దుంగుల సంపత్, ఉడుగుల రాజు, భూస అశోక్, కాస ప్రవీణ్ కుమార్, మర్రి రామస్వామి, బాదావత్ త్ బాల కిషన్, భూక్య వెంకన్న, బిఆర్ఎస్ పార్టీ బాధ్యులు నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వేలో పక్కా లెక్కలు!

**భూముల హద్దులు.. విస్తీర్ణం.. రికార్డులపై ప్రత్యేక దృష్టి కొండాపూర్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన వరంగల్ ఆర్డీవో టి.సుమ**

**రాయపర్తి, సెప్టెంబరు 5 (వుదయం ప్రతినిధి):**




భూముల వివరాలను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా నమోదు చేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను వరంగల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) టి.సుమ శనివారం రాయపర్తి మండలం కొండాపూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కొండాపూర్ రాయపర్తి మండలం కొండాపూర్ గ్రామాన్ని రీసర్వే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. రీసర్వే పూర్తయిన అనంతరం భూముల కొలతలు, విస్తీర్ణం, హద్దులు, భూ రికార్డుల వివరాలు మరింత స్పష్టంగా, కచ్చితత్వంతో నమోదవుతాయని అధికారులు తెలిపారు. తద్వారా భవిష్యత్తులో భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

ఫీల్డ్‌లో సర్వే సిబ్బంది చేపడుతున్న భూముల కొలతలు, హద్దుల గుర్తింపు, భూ రికార్డులతో వివరాల అనుసంధానం తదితర అంశాలను ఆర్డీవో ప్రత్యక్షంగా పరిశీలించారు. రీసర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా భూముల వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నమోదు చేయాలని, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను పూర్తి చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు.రైతులు సహకరించాలి..రైతులు తమ భూముల వద్ద సర్వే నిర్వహించే సమయంలో అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని ఆర్డీవో కోరారు.తమ భూములకు సంబంధించిన పాత భూ రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రీసర్వే సమయంలో రైతులకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు లేదా భూ సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రీసర్వే ప్రక్రియను సక్రమంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతానికి సహకరించాలి కొండాపూర్ గ్రామం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున రీసర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు రైతులు, భూ యజమానులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని ఆర్డీవో విజ్ఞప్తి చేశారు. రీసర్వే ద్వారా భూములపై స్పష్టమైన వివరాలు అందుబాటులోకి రావడంతో భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలకు పరిష్కార మార్గం సుగమం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, రెవెన్యూ యు అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి పనులకు అడ్డుగా ఉన్నామని
## చెక్ పవర్ రద్దు చేయమంటున్నారు

**ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు తుంగల శ్రీజ సంతోష్**

**మహాదేవపూర్ , సెప్టెంబర్ 05(వుదయం ప్రతినిధి):**



సర్పంచ్ లు చేసే అవినీతి పనులకు అడ్డుగా ఉన్నామనే ఉపసర్పంచ్ ల చెక్ పవర్ రద్దు చేయమంటున్నారని ఉపసర్పంచుల ఫోరం మహాదేవపూర్ మండల అధ్యక్షురాలు తుంగల శ్రీజ సంతోష్ఆరోపించారు.శనివారం ఆమె మాట్లాడుతూ ఉపసర్పంచుల ఫోరం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ఆవిర్భావ సభ భవిష్యత్తులో మహిళా ఉపసర్పంచులు ఎదగడానికి ఏర్పాటు చేశారన్నారు. నేడు హైదరాబాద్ లోని కంట్రీ క్లబ్, బేగంపేట్ లో ఉదయం 10 గంటలకు మహిళా ఉపసర్పంచుల విభాగం ఆవిర్భావ

సభ ఉందని, ఉపసర్పంచ్ లందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కొందరు సర్పంచులు చేసే అవినీతి పనులకు అడ్డుగా ఉన్న ఉపసర్పంచ్ ల చెక్ పవర్ ను తొలగించడానికి సర్పంచులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. శిలాఫలకాలపై సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ మరియు సంబంధిత వార్డు సభ్యుని పేరు ఉండాలి అని గౌరవ వేతనం ఉపసర్పంచ్ కి రూ.5000, వార్డు సభ్యులకు రూ.3000 ఇవ్వాలి అని ఇందిరమ్మ కమిటీకి చైర్మన్ సర్పంచ్ అయితే వైస్ చైర్మన్ ఉపసర్పంచ్ ని చేయాలి నూతన గృహ నిర్మాణాలకు సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ కు కూడా అధికారాలు ఉండాలి అని డిమాండ్ చేశారు ఉపసర్పంచ్ కి చెక్ పవర్ ఉండటం వల్ల కొందరు సర్పంచులు ఎలాంటి అవకతవకలకు పాల్పడలేకపోతున్నారని, ఉపసర్పంచులు దాదాపు చదువుకున్న వారు కావడంతో సర్పంచులు చూపించే తప్పుడు లెక్కలను ప్రశ్నిస్తూ ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా కంచు కోటలా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు అధికారులు విధుల నుండి బహిష్కరించిన వారిలో సర్పంచులే ఉన్నారని, ఉపసర్పంచ్ లు లేరని, కొన్ని చోట్ల సర్పంచుల భర్తలే అధికారం చలాయిస్తున్నారని ఆరోపించారు.

చెక్ పవర్ లేకుంటే సర్పంచులు తమకు అడ్డొచ్చిన కార్యదర్శులను బదిలీ చేయించి తమకు నచ్చిన వారిని తెచ్చుకుంటారని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహిళా ఉపసర్పంచులు భారీ సంఖ్యలో ఆవిర్భావ సభకు తరలిరావాలని కోరారు.

### ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం సభ్యులు
## కోడూరి అశోక్ ,సతీమణి సంధ్యారాణి ఘనంగా సన్మానించారు

**నెక్కొండ సెప్టెంబర్ 5 వుదయం ప్రతినిధి**



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన మండల సంఘం సభ్యులు కోడూరి అశోక్ ,వారి సతీమణి శ్రీమతి సంధ్యారాణి ఈరోజు మన మండల సంఘం భవనంలో ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా మండల సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మన సంఘానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను సన్మానించుకోవడం మన సంఘానికి ఎంతోగౌరవంగా, ఆనందంగా ఉందని తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారు అందిస్తున్న సేవలు

అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు మాదాసు రవి, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి బొల్లం రాములు, సీనియర్ సభ్యులు యాసం కుమారస్వామి, బైరూ కుమారస్వామి, టాగూర్ కిషన్, బండారి అనిల్కుమార్,ఆత్మకూరుసతీష్ పాల్గొని సన్మానిత ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో భక్తి భావంతో గురుపూజోత్సవం

**పర్వతగిరి , సెప్టెంబర్ 5 ( వుదయం ప్రతినిధి ):**




మండల కేంద్రం లోని జెడ్ పి హెచ్ ఎస్ పర్వతగిరి ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ చీదురు శంకర్ విచ్చేసి ఉపాధ్యాయులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావిభారత ఉత్తమ పౌరులను రూపుదిద్దే ఉపాధ్యాయులను సమాజం భగవత్ స్వరూపులుగా పరిగణించి గౌరవించాలని అన్నారు. సభాధ్యక్షులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్, మాట్లాడుతూ భారతరత్న శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినం పురస్కరించుకొని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు నిరంతరం నిస్వార్థంతో శ్రమిస్తున్న ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు నడవాలని సూచించారు. సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు.. మాట్లాడుతూ ఈనాటి ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు లాంటి సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ ఉపాధ్యాయుడు ప్రత్యక్ష బోధనకు సాటి రాదని, గురు శిష్యుల మధ్య సంబంధం భగవంతునికి భక్తునికి మధ్య లాగా ఉండాలని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ , శాంతి కిరణ్ , మీ పరుశురాములు , అశోక్ ,డాక్టర్ మడత భాస్కర్ , మనోహర్,అనిల్ కుమార్, తిరుపతి, తిరుమల, రాధాకృష్ణకుమారి, బి రేఖ, .వెంకన్న, మౌనిక, ఐ రమేష్ బాబు గారు డాక్టర్ ఎం రాజలక్ష్మి, జి ప్రశాంత్ గారు శ్వేత, పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అద్యంతం గురు భక్తి తో ఘనంగా నిర్వహించారు.

# ఉపాధ్యాయులే భావితరాల శిల్పులు...

**ప్రభుత్వ పాఠశాలల గురువులకు సన్మానం... మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి..**

**వర్ధన్నపేట, సెప్టెంబరు 5 (వుదయం ప్రతినిధి):**



విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులకు ఉపాధ్యాయులే మంచి మార్గదర్శకులని అన్నారు.విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను విద్యార్థుల్లో పెం పొం దిం చ డం లో గురువుల సేవలు అమూల్యమని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి అందించిన సేవలు, ఆయన ఆలోచనలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల కృషి చిరస్మరణీయమని, విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు వారు చేస్తున్న సేవలను అభినందించారు.వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు మున్సిపాలిటీ తరఫున తన వంతు కృషి చేస్తానని సారంగపాణి తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి-రాజేందర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ బెజ్జం పాపారావు, మాజీ వార్డు కౌన్సిలర్ పాలకుర్తి సుజాత, నాయకులు పాలకుర్తి శ్రీకాంత్, మాలోతు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

**పర్వతగిరి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సత్కారములు**

**పర్వతగిరి , సెప్టెంబర్ 5 ( వుదయం ప్రతినిధి ):**



సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే అని పర్వతగిరి మండల అభివృద్ధి అధికారి ఎం. శంకర్ నాయక్ , పర్వతగిరి మండల తహసిల్దార్ టి వెంకటస్వామి అన్నారు. పర్వతగిరి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరం నందు నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మండల విద్యాశాఖ అధికారి ఏ బిక్షపతి వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా ఏనుగల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జి లింగారెడ్డి , పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కే నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఉత్తమ ఉ పా ధ్యా యు లు గా సేవలందించిన వారిని గుర్తించి పూలదండ,శాలువా, ప్రశంసా పత్రంతో సత్కరించారు. సత్కారం పొందిన వారిలో గెజిటెడ్ ఉపాధ్యాయుల కేటగిరిలో జి లింగారెడ్డి జడ్. పి.హెచ్.ఎస్ ఏనుగల్, స్కూల్ అసిస్టెంట్ క్యాటగిరిలో ఎస్ పురుషోత్తమరావు ఎస్ ఏ సోషల్ జడ్.పి.హెచ్.ఎస్ గోపనపల్లి ఏ కళ్యాణి ఎస్ఎ సోషల్ జడ్పీహెచ్ఎస్ చింత నెక్కొండ ఎండి ఆఫీస్ ఎస్ ఎ ఇంగ్లీష్ జడ్పీహెచ్ఎస్ కొంకపాక వి కేశవులు ఎస్ఏ సోషల్ జడ్.పి.హెచ్. ఎస్ ఏనుగల్ ఎం రాజ్యలక్ష్మి ఎస్ ఏ హిందీ జెడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పిఎస్ హెచ్ఎం క్యాటగిరిలో టి శేషమ్మ పి ఎస్ ఎంపిపిఎస్ గోపనపల్లి బి శ్రీధర్ ఎంపిపిఎస్ ఇస్లావత్ తండా ఎస్ జి టి క్యాటగిరిలో ఎస్ శ్రీధర్ యుపిఎస్ దౌలత్ నగర్ ఎస్ ఉపేంద్ర పీఎస్ లాలు తండా బి నవీన్ పీఎస్ పర్వతగిరి డి కిషోర్ పీఎస్ చౌటపల్లి టి వేణు పిఎస్ పెద్ద తండా జి కిషన్ పీఎస్ పర్వతగిరి డి రజనీ దేవి ఎంపియుపిఎస్ బూరుగుమల్ల పి శిరీష పీఎస్ వడ్లకొండ, పీ ఈ టీ క్యాటగిరిలో బి సురేష్ మోడల్ స్కూల్ నాన్ గవర్నమెంట్ మేనేజ్మెంట్ క్యాటగిరిలో ఎస్ స్వాతి టిజిటి ఫిజిక్స్ సోషల్ వెల్ఫేర్ పర్వతగిరి కే వరలక్ష్మి టీజీటీ ఇంగ్లీష్ ట్రైబల్ వెల్ఫేర్ సోమారం బి దేవేందర్ సీఆర్టీ తెలుగు బాయ్స్ ఆశ్రమ పాఠశాల ఏ రాణి సిఆర్టి హిందీ కేజీబీవీ కే శ్రీనివాస్ హెచ్ ఎం ఆర్డీఎఫ్ కల్లెడ ఉన్నారు.

## ఎస్.పి.ఆర్. ఎల్లాపూర్ లో మెగా రక్తదాన శిబిరం

**హసన్ పర్తి సెప్టెంబర్5 (వుదయం ప్రతినిధి):**



హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ శివారులోని ఎస్.పి.ఆర్. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ, హన్మకొండ వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్ మాట్లాడుతూ..., ఈ రోజుల్లో రక్తదానం ఒక సామాజిక అవసరమని, ప్రాణాలను నిలబెట్టే శక్తి రక్తానికి ఉందని, అలాగే ఆరోగ్యంగా ఉండాలంటే రక్త శుద్ధి తప్పనిసరని, అందుకే సంవత్సరానికి కనీసం రెండు సార్లు రక్త దానం చేయాలనీ, అది పౌరుని సామాజిక బాధ్యతగా భావించాలనీ, ఒక వ్యక్తి రక్తదానం చేయడం వల్ల మరో నలుగురిని కాపాడవచ్చని, ప్రాణాలను కాపాడే ప్రయాణంలో ప్రతి రక్తపు చుక్కా విలువైనదేనని, అదే విధంగా ఈనాటి విద్యార్థినీ విద్యార్థులైన మీరు ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రేపటి భావి భారత పౌరులుగా ఇలాంటి సామాజిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. నేటి సమాజంలో ప్రతీది వ్యాపారంగా చూస్తున్న తరుణంలో నా ఆలోచనలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులు,

విద్యార్థుల తల్లిదండ్రులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ముందుకు రావడం వలన రెడ్ క్రాస్ సొసైటీ, హన్మకొండ ఆధ్వర్యంలో పాఠశాలలో 50 మంది రక్త దానం చేయడం జరిగిందని తెలిపారు. వారిని కాపాడడానికి అత్యవసరంగా రక్తం అవసరమవుతుందనీ, కాబట్టి అలాంటి వారిని కాపాడుకోవడం కోసం రక్త దానం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, అన్ని దానాలలో కెల్ల రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కా పాడవచ్చునని వివరించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానం చేసి వారి గురు భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువుల గొప్పతనాన్ని తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు ఈ ప్రాంత రైతులకు
## మధు ఎందుకు అందించలేకపోయారు...

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు**

**జయశంకర్ భూపాలపల్లి ,సెప్టెంబర్ 05(వుదయం జిల్లా ప్రతినిధి):**



గత ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు మంథని నియోజకవర్గ రైతులకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఎందుకు అందించలేకపోయారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ప్రశ్నించారు.శనివారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ వంటావార్పు కార్యక్రమంలో భాగంగా కాటారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాష్ట్రమంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అందే విధంగా కృషి చేస్తుందని మేనిఫెస్టోలో ప్రకటించిన గ్యారెంటీ పథకాలను అమలు చేసిందని అన్నారు గత ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు మంథని ని యో జ క వ ర్గ రైతులకు పుట్ట మధు ఎందుకు అందించలేకపోయారని ప్రశ్నించారు తిట్టడమే పనిగా పెట్టుకున్న మీకు నియోజకవర్గం ప్రజలు ఎందుకు తిరస్కరిస్తున్నారని ప్రశ్నించారు. ఐదు సార్లు ప్రజల ఆదరణతో మా నాయకుడు శ్రీధర్ బాబు విజయం సాధించారని ఒక్కసారి గెలిచిన మీరు మాట్లాడే విధానం మార్చుకోవాలని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు ఫ్రీ కరెంటు ఇస్తున్నామని,ఫ్రీ బస్సు తోపాటు మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ నియోజిక వర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేసి రెండు వేల మంది విద్యార్థులకు మంచి సౌకర్యాలతో విద్య అందిస్తున్నామని అన్నారు. పాఠశాలల్లో అల్పాహారం ఇస్తూ హాస్టల్ పిల్లలకు నలభై శాతం మెస్ ఛార్జీలు పెంచామని అన్నారు.ప్రతీ మహిళను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో మహిళా సంఘాలకు వేయి ఆర్టీసీ బస్సులు కొని వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు.విద్యా వైద్యంపై దృష్టి సారిస్తూ ప్రజలకు సౌకర్యాలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుంగల శ్రీజ, మాజీ ఎంపిటిసి ఆకుతోట సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు అస్రార్ ఖురేషి, వార్డు సభ్యులు గడ్డం స్వామి నయుముద్దీన్, నగేష్ యాదవ్, తోపాటు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై సత్తుపల్లిలో బీఆర్ఎస్ రణభేరి

**విద్యార్థులు, నిరుద్యోగులతో సండ్ర వెంకట వీరయ్య భారీ ర్యాలీ**

**సత్తుపల్లి సెప్టెంబర్ 5 ( ఉదయం ప్రతినిధి)**

ఎన్నికల సమయంలో యువత, విద్యార్థుల భవిష్యత్తును మార్చుతామని యూత్ డిక్లరేషన్ పేరుతో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు పూర్తయినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన "1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాట" లో భాగంగా సత్తుపల్లిలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. 100 రోజుల్లో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తయినా ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, విద్యా భరోసా కార్డులు వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకుల విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సండ్ర ఆరోపించారు. జిల్లాకో యూపీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, పోటీ పరీక్షల దరఖాస్తు రుసుముల మినహాయింపు వంటి హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, యూత్ డిక్లరేషన్‌లోని ప్రతి అంశంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. "విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా వెంటనే హామీలను అమలు చేయాలి. లేదంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని సండ్ర హెచ్చరించారు.




## అమ్మవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మిస్తానన్న వ్యాపారి భీమరాజు నర్సింగ్**

**చండూరు, సెప్టెంబర్ 5(ఉదయం):**



చండూరు మండలం కొండాపురం మండల పరిధిలోని కొండాపురం గ్రామం ఎస్సీ కాలనీలో శ్రీ ముత్యాలమ్మ ఆలయ నూతన నిర్మాణానికి శనివారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, సామాజిక సేవకుడు భీమరాజు నర్సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా భీమరాజు నర్సింగ్ మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాన్ని తన సొంత నిధులతో పూర్తిస్థాయిలో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును తానే భరించి, సకల సౌకర్యాలతో అందమైన ఆలయాన్ని నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తానని స్పష్టం చేశారు. దేవాలయాలు ఆధ్యాత్మిక ప్రశాంతతకే గాక సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో కొండాపురం గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా మడేలేశ్వర స్వామి బోనాల ఉత్సవాలు

**మునగాల, సెప్టెంబర్ 05 (ఉదయం):**



రజకుల ఆరాధ్య దైవం సీతాలమ్మ సమేత మడేలేశ్వర స్వామి తొలి వార్షికోత్సవాల సందర్భంగా మునగాల గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద ఉన్న మడేలేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గ్రామంలోని రజక కుటుంబాల సభ్యులు తమ ఇళ్ల నుంచి పవిత్ర గంగాజలాలను తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామ పురోహితులు వారణాసి బుచ్చి రామయ్య శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రతి రజక కుటుంబం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను తీసుకుని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తిశ్రద్ధలతో భారీ బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలతో స్వామివారి ఆలయానికి చేరుకుని బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మడేలేశ్వర స్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. రజకుల ఆరాధ్య దైవమైన మడేలేశ్వర స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రజకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## మర్రిగూడ పీఎం శ్రీ మోడల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**గురువుల సేవలు అమూల్యం: ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం**

**మర్రిగూడ, సెప్టెంబరు 5(ఉదయం):**

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు సువర్ణమయం అవుతుందని మర్రిగూడ పీఎం శ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా భారత మాజీ రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న గురువులపై ఉన్న గౌరవాన్ని చాటుకుంటూ వారిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు ఆర్. కరుణాకర్, జి. సబిత, పి. శ్రీనివాస్, వి. దొరతి, జి. మాధురి, పి. లింగస్వామి, డి. భవాని, కె. నాగమనీషా, ఎన్. వెంకటయ్య, మహమ్మద్ రజియుద్దీన్, బి. సూర్యకుమారి, టి. అనురాధ, బి. కోమలి, జె. విజయ, సాజిద, యాదయ్య, శంకర్, నసరత్, చంద్రమౌళి, సమతా, వెంకటరమణ, లక్ష్మీ, రామ్ నరేష్, శ్రీహరి, కొండల్‌తో పాటు నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమగ్ర కులగణన చేయాలి

**తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్**

**ఖమ్మం ఉదయం బ్యూరో సెప్టెంబర్ 5**




దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖచ్చితంగా ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగా బిసిలకు క్యాస్ట్, సబ్ క్యాస్ట్ కాలమ్ పెట్టాలని పేర్కొన్నారు. బిసిల గణన లేకపోవడంతో నష్ట పోతున్నారని అన్నారు. అంతేగాకుండా సబ్ క్యాస్ కాలమ్ లేకపోవడంతో బిసిల్లోని ఉప కులాల జనాభా తెలియడం లేదన్నారు. దీని వల్ల ఏ కులం ఎంత జనాభా అన్నది అర్థంగాకుండా పోతోందన్నారు. అందుకే బిసిల్లోని ఉప కులాల కాలమ్ పెట్టి జనగణన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 8, 9 జీవోలను రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి యలమందల జగదీష్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు, స్టేట్ యూత్ వైస్ ప్రెసిడెంట్ కొత్తా వినయ్ బాబు, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కొరివి ధనలక్ష్మీ, నాయుకులు పొన్నం వెంకటేశ్వర్లు గౌడ్, రావుస్వామి, రాజేష్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలను పాటించడమే నిజమైన గురుదక్షిణ



**సూర్యాపేట, సెప్టెంబర్ 5: ఉదయం ప్రతినిధి**

ఈరోజు సాయంత్రం బ్రాహ్మణ కళ్యాణ మండపంలో మహిళా ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చింతమల్ల సుజాత, దండ ధనలక్ష్మి, వై నిర్మల, కె సమత, పోరెడ్డి కవితలను సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, ఉమా, లక్ష్మి, విజయ, రాములమ్మ, సింధుజ, సింధు, విజయ, స్వరూప, కరుణశ్రీ, సామ్రాజ్యం, శోభ, స్వాతి మొదలగు సాధకులు పాల్గొన్నారు. సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రంలో ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం) సందర్భంగా ఉపాధ్యాయులను యోగ సాధకులు ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా యోగా గురువు చాడ పాపిరెడ్డి మాట్లాడుతూ – డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జీవితం మనకు నేర్పిన వినమ్రతను, గురు శిష్యుల మధ్య ఉండాల్సిన పవిత్ర బంధాన్ని నేటి తరం పునఃపరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈరోజు మనం జరుపుకునే వేడుక కేవలం ఒక ఆచారం కాదు, మన భవిష్యత్తు కోసం తమ జీవితాలను ధారపోసిన మహనీయులకు ఇచ్చే హృదయపూర్వక గౌరవం అన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా గురువు స్థానాన్ని ఏ డిజిటల్ స్క్రీన్ భర్తీ చేయలేదని, టెక్నాలజీ సాధనం మాత్రమే కానీ గురువు మన జీవితాలను వెలిగించే చైతన్య దీపం అని అన్నారు. నేటి తరం పిల్లలు డిజిటల్ స్క్రీన్ల ప్రపంచం నుంచి బయటకు వచ్చి గురువు అనుభవ పాఠాల నుంచి నిజమైన విజ్ఞానాన్ని పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగులు కారని, వారి శ్రమ వెనుక ఒక తరం భవిష్యత్తు దాగి ఉందని, పరస్పర గౌరవం, ఆప్యాయత ఉన్నప్పుడే విద్యార్థి పరిపూర్ణ మానవుడిగా ఎదుగుతాడని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులైన శ్రీధర్ గారు, చంద్రశేఖర్ గారు, రాములు గారిని సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వల్కి లింగయ్య, మల్లారెడ్డి, నేతగాని వెంకన్న, గోరెంట్ల శ్రీనివాస్, బాణాల శ్రీనివాస్, బాణాల శ్రీనివాస చారి, మురళీ కృష్ణ, బాలకృష్ణ, మంజుల, సరిత, జ్యోతి, ధనలక్ష్మి, పద్మ సాధకులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ మామిళ్లగూడెం బ్రాంచ్‌లో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

**మామిళ్లగూడెం, సెప్టెంబర్ 5:**



శ్రీ చైతన్య టెక్నో స్కూల్, మామిళ్లగూడెం బ్రాంచ్‌లో టీచర్స్ డే వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల ప్రేమ, గౌరవాన్ని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, ప్రత్యేక ప్రదర్శనల ద్వారా వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్, హైస్కూల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపల్ నీరజ, ప్రైమరీ కోఆర్డినేటర్ పార్వతి, ప్రీ–ప్రైమరీ కోఆర్డినేటర్ గౌతమి, ప్రైమరీ ఇన్‌చార్జ్ కల్యాణి, ప్రీ–ప్రైమరీ ఇన్‌చార్జ్ గీత, హైస్కూల్ డీన్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత టీఆర్ఎస్ కు లేదు

**భువనగిరి అభివృద్ధిపై చర్చకు సిద్ధం: మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్**

**యాదాద్రి భువనగిరి 05-09-2026**



కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై, అభివృద్ధిపై టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడడం సరికాదని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, టీపీసీసీ సభ్యులు తంగాళ్లపల్లి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మా ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గం, భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తమ ప్రభుత్వం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిందని, పట్టణంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, బస్వాపురం, తిమ్మాపూర్ బాధితులకు సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి పరిహారం ఇప్పించారని తెలిపారు. ఇదే కాకుండా పట్టణంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. భువనగిరి నియోజకవర్గం మరియు మున్సిపల్ అభివృద్ధి, సంక్షేమంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, సమయం, వేదిక మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి గారే నిర్ణయించాలని వారు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగళ్ల పల్లి రవికుమార్ పాల కుర్తి అబ్బర్వర్ పోత్నాక్ ప్రమోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కుక్క దుగు సోమయ్య సీనియర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు మైనార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం అభివృద్ధి తో ప్రజాపాలన

**యాదాద్రి భువనగిరి 05-09-2026**



భువనగిరి చివర్లో sv గెస్ట్ హౌస్ నందు సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి ప్రజా పాలన నిరంతరం ప్రజా క్షేత్రంలో పనిచేస్తున్న కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆశీస్సులతో భువనగిరి మండల ప్రజానీకం మరింత సంక్షేమ పథకాలు అందించే విధంగా పనిచేస్తూ పని చేస్తూ పార్టీ గ్రామ శాఖలను ఏర్పాటు చేయాలని మరియు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అని కమిటీ తీర్మానం చేయడం జరిగింది గడపగడపకు సంక్షేమ పథకాలను సమగ్ర అభివృద్ధి సాగునీరు తాగునీరు ప్రజా ప్రతినిధులతో ముందుకు వెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య గారు, చుక్క స్వామి, చిక్కుల వెంకటేష్, ఎడ్ల వెంకట్ రెడ్డి, విఠల్ వెంకటేశ్, ఓరుగంటి అంజయ్య, మైలారం వెంకటేష్,నల్లగొండ ప్రభాకర్, చిన్నాబాతిని స్వరూప లూర్దయ్య, రజిత, శోకం రాజశేఖర్, రవి, కృష్ణమూర్తి, రమేష్, శ్రీశైలం, గణేష్, మహిపాల్, సాయిదమ్మ, పద్మ పాల్గొనారు..

## సర్వోత్తమన్న ఆధ్వర్యంలో నకిరేకల్ ప్రజా వికాస సభకు 200 కార్లతో తరలిన కాంగ్రెస్ శ్రేణులు



- పదేళ్లు ప్రజలను గాలికొదిలేసి నేడు బీఆర్ఎస్ నేతల మొసలి కన్నీరు
- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**సూర్యాపేట సెప్టెంబర్ 5: ఉదయం ప్రతినిధి**

నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే ప్రజా వికాస సభకు సూర్యాపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 కార్లతో భారీ వాహన శ్రేణితో నకిరేకల్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య , మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది తో కలిసి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందనను చూసి బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక నిరసన డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలను పూర్తిగా విస్మరించిన ఆ పార్టీ నాయకులు, నేడు ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు అర్హులైన ప్రజలకు రేషన్ కార్డులు అందించడంలో నిర్లక్ష్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం లక్షలాది కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రతి లబ్ధిదారునికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తోందన్నారు. అదేవిధంగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించి ప్రజల అపారమైన అభిమానాన్ని సొంతం చేసుకుందని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు సూర్యాపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.



## బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

**చర్ల, సెప్టెంబర్ 5:(ఉదయం ప్రతినిధి)**

చర్ల మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు నూప రమేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూప రమేష్ మాట్లాడుతూ.. చర్ల మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలు, రైతుల సమస్యలు, ఇతర ప్రజా సమస్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చర్ల మండల శాఖ నిరంతరం పోరాడుతుందని, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని చర్ల మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, ప్రతి గ్రామంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహించే సేవా పఖ్వాడా కార్యక్రమాలను మండలం అంతటా విజయవంతం చేయాలని సూచించారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, పేదలకు సహాయం చేయడం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బాబాహీమ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గునూరి రమణ, మండల ప్రధాన కార్యదర్శి బోడిక సందీప్, కార్యదర్శులు ముత్తవరపు శ్రీనివాస్, చారి విశ్వనాథం, కుప్ప మాధవరావు, యువ మోర్చా అధ్యక్షుడు పి. వినయ్, అనంతపూర్ సతీష్, సుక్క శివ తదితరులతో పాటు వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వివాహ వేడుకలు హాజరైన మాజీ జెడ్పీటిసి పైడి

**దమ్మపేట సెప్టెంబర్ 5 (ఉదయం ప్రతినిధి)**

దమ్మపేట మండలం ఎర్రగుంపు గ్రామానికి చెందిన పొట్టా బాలకృష్ణ–కుమారి దంపతుల కుమార్తె కృష్ణకుమారి–రాజశేఖర్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఈ కార్యక్రమంలో దొడ్డాకుల రాజేశ్వరరావు, కోయ్యల అచ్యుతరావు, గంగరాజు, వంకా బాబురావు, వాడే వెంకటరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మ బోనాలు

**మునుగోడు, సెప్టెంబర్ 5 (ఉదయం):**

జక్కలవారిగూడెంలో ముత్యాలమ్మ బోనాల పండుగ శనివారం అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధల నడుమ సాగింది. గ్రామంలోని మహిళలు, యువత, పెద్దలు ఐకమత్యంతో తరలి వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల సిగాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో ఊరంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల కోలాహలంతో వీధులన్నీ సందడిగా మారాయి. ఈ వేడుకల్లో 5వ వార్డు మెంబర్ దాసరి గణేష్ యాదవ్, 2వ వార్డు మెంబర్ జక్కల కృష్ణ యాదవ్, 3వ వార్డు మెంబర్ దాసరి రేణుక సురేష్ యాదవ్, మాజీ సర్పంచ్ జక్కల శీను యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దోటి రమేష్, దోటి నగేష్, లింగస్వామి, నర్సింహా తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**సత్తుపల్లి సెప్టెంబర్ 5 ( ఉదయం ప్రతినిధి)**



సత్తుపల్లి మండల పరిధిలోని బి గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ అన్ని బ్రాంచీలు, డిప్లొమా, యంబిఎ విద్యార్థినీ, విద్యార్థులు మరియు జాతీయ సేవా పథకం( ఎన్ ఎస్ ఎస్)విభాగం వారి సంయుక్తాధ్వర్యంలో కళాశాలలో శనివారం నాడు డాక్టర్ సర్వపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్:పూటుకూరి.శేషారత్నకుమారి మాట్లాడుతూ గౌరవనీయులైన ఉపాధ్యాయులు, ప్రియమైన విద్యార్థులు, తల్లి దండ్రులు మరియు నా సహచరులందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ రోజు మనందరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. మనకు జ్ఞానాన్ని అందిస్తూ, మంచిమార్గంలో నడిపించే గురువులను గౌరవించుకునే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మీ ముందుకు రావడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. మన దేశంలో సెప్టెంబర్ 5నే ఈ ప్రత్యేక దినోత్సవాన్ని జరుపుకోవడానికి కారణం భారత ద్వితీయ రాష్ట్రపతిగా అద్వితీయంగా తన పదవీ బాధ్యతలను నిర్వహించిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ (1888–1975) జన్మదినం కావడమే. ఈ సందర్భంగా జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత,రాజ్యసభ సభ్యులు మరియు సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి.పార్థసారథిరెడ్డి , విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి.అన్విద లకు వర్చువల్ గా మన ఉపాధ్యాయులందరికీ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. కళాశాల సెక్రటరీ&కరస్పాండెంట్ దాసరి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మన కళాశాలలోని ప్రతి ఉపాధ్యాయుడికి నా తరఫున, మన కళాశాల యాజమాన్యం తరపున హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని వేడుకలను పురస్కరించుకొని ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మరియు అకాడమిక్ డీన్ డాక్టర్ ఎస్ కే యాకూబ్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి.రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని కళాశాలలో టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి.రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యా బోధనతో పాటు సమాజానికి విలువలు, క్రమశిక్షణ, నైతికతను అందిస్తూ భావితరాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని చెప్పారు. అన్నీఇంజినీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు మరియు జాతీయ సేవా పథకం( ఎన్ ఎస్ ఎస్)ప్రోగ్రాం ఆఫీసర్ బలుసుపాటి.సీతారాములు అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు. కళాశాల ఫ్యాకల్టీ మెంబర్స్ కు విద్యార్థినీ, విద్యార్థులు శుభాకాంక్షలు/అభినందనలు తెలియజేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**మధిర, సెప్టెంబర్ 5, ఉదయం ప్రతినిధి:**



పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు అన్నారు.మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ మిర్యాల వెంకటరమణ గుప్తా, కౌన్సిలర్లు బాణావత్ వెంకటరమణ నాయక్, శ్రీపాలశెట్టి వెంకట్రావు,దారా నాగార్జున,రసీదున్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు సాలిక సురేష్, రామాలయ కమిటీ చైర్మన్ వంగవీటి రాజశేఖర్,డివిజన్ కమిటీ అధ్యక్షులు సామినేని రామనాథం,దోర్నాల నాగమల్లి, దోర్నాల సునీల్,దౌసుద్దీన్, మైలవరపు చక్రి,దోర్నాల రవి, గాలి ప్రసాద్,గౌరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిన్ సీట్ సాధించిన విద్యార్థిని పూజితను అభినందించిన సీఐ మధు

**మధిర, సెప్టెంబర్ 5, ఉదయం ప్రతినిధి:**




ఎంబీబీఎస్ లో సీటు పొందిన మధిర టౌన్ పోలీస్ స్టేషన్లో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న మడుపల్లి గ్రామానికి చెందిన పొదిలి మురళీకృష్ణ కుమార్తె పూజితను మధిర రూరల్ సీఐ డి మధు అభినందించారు. కష్టపడి సాధించిన సీటు లో లక్ష్యం సాధించే దిశగా కష్టపడి ఇష్టంతో చదివి కోర్సు పూర్తి చేయడమే కాకుండా ఉన్నత విద్య ను అభ్యసించి పేద వర్గాలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సిఐ మధు దిశా నిర్దేశం చేశారు.పూజిత సిద్దిపేట లోని మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. పోలీస్ డిపార్ట్మెంట్లో కింది స్థాయి ఉద్యోగిగా పనిచేస్తున్నప్పటికీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రణాళికతో అడుగులేస్తున్న మురళి కృష్ణను సిఐ అభినందించారు.

## అభివృద్ధి పనులపై సర్పంచ్ సోయం నాగలక్ష్మి పర్యవేక్షణ




**చర్ల, సెప్టెంబర్ 5:( ఉదయం ప్రతినిధి)**

ఉప్పరిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను సర్పంచ్ సోయం నాగలక్ష్మి దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి వివరాల్లో తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని సూచిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగసముద్రం, ఉప్పరిగూడెం అంగన్‌వాడీ పాఠశాలల చిన్నారులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం కల్పించారు.

ఉప్పరిగూడెం, సింగసముద్రం గ్రామాల్లో విద్యుత్ స్తంభాల వద్ద అవసరమైన పనులను సిబ్బందితో కలిసి పర్యవేక్షించి, సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలబడే విధంగా ఉపాధ్యాయులు



కొడంగల్ (వుదయం) : తెలంగాణ విద్యార్థులు దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచేలా ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం, 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. అంతకుముందు సర్వేపల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి తిలకించగా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ యోగితా రాణా, కమిషనర్ దేవసేన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా రంగంలో రాష్ట్రం 28 నుంచి 17వ స్థానానికి ఎగబాకిందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 88 వేలు పెరిగిందని తెలిపారు. 55 రోజుల్లోనే డీఎస్సీ ద్వారా 10,006 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, 25,950 మందికి పదోన్నతులు, 34,706 బదిలీలు, 317 జీవో సమస్యను పారదర్శకంగా పరిష్కరించామని, రిటైర్మెంట్ బకాయిల కోసం రూ.6 వేల కోట్లు విడుదల చేశామని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విద్యా కమిషన్ ఏర్పాటుతో పాటు కే.కేశవరావును సలహాదారుగా నియమించామన్నారు. శ్రీపాల్ కోరిన పీఆర్సీతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి రెండేళ్ల సమయం ఇవ్వాలని, రాజకీయ నాయకుల ఉచ్చులో పడి ఉపాధ్యాయులు రోడ్డెక్కవద్దని సీఎం విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఐటీఐలను ఏటీసీలుగా, పాలిటెక్నిక్‌లను స్కిల్ వర్సిటీలుగా మారుస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు ప్రసంగిస్తూ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు బి. మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ అభిలాష అభినవ్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలతో భవిష్యత్తుకు సంకెళ్లు

**చట్టవిరుద్ధంగా వివాహాలు చేస్తే కఠిన చర్యలు : రాయపోల్ ఎస్ఐ కె.మానస**




దౌల్తాబాద్ (వుదయం) : బాల్య వివాహాలు బాలల ప్రగతికి, భవిష్యత్తుకు సంకెళ్లుగా మారుతాయని, వీటిని ప్రోత్సహించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని రాయపోల్ ఎస్ఐ కె.మానస, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సిద్దిపేట జిల్లా కో-ఆర్డినేటర్ బండకాడి గణేష్ పేర్కొన్నారు. రాయపోల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా కలెక్టర్, డీసీపీవో ఆదేశాల మేరకు శనివారం విద్యార్థినులకు బాల్య వివాహాల నిర్మూలన చట్టం–2006పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.మానస మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని బాలికలకు, 21 సంవత్సరాలు నిండని బాలురకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు జరిపించే వారితో పాటు వాటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే వారు, అలాగే విషయం తెలిసీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఉండే వారు సైతం చట్టపరంగా శిక్షార్హులే అవుతారని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల బాలబాలికలు మానసికంగా, శారీరకంగా అనేక ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొని తమ ఉజ్వల భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందని, కాబట్టి సమాజంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 10 ఏండ్ల బిఆర్ఎస్ పాలలో అభివృద్ధి సున్నా.

**ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు పెద్దపీట. ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి .**




నారాయణఖేడ్ (వుదయం) : కాంగ్రెస్ ప్రజా పాలన వెయ్యి రోజుల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే నివాసం నుంచి రాజీవ్ కూడలి వరకు ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ సెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ప్రజలను దగా చేశారని, వారు చేయలేని అభివృద్ధిని ప్రజా ప్రభుత్వం చేసి చూపిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, రిజర్వేషన్లు వంటి హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని, త్వరలోనే రెండో విడత పంపిణీకి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే విడతలో రూ.21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# తెల్లాపూర్‌లో జి. ఎల్లన్న ప్రథమ వర్ధంతి..



తెల్లాపూర్ (వుదయం) : తెల్లాపూర్ జి.వై. ఎన్‌క్లేవ్‌లో ఘనంగా నిర్వహించిన దివంగత జి. ఎల్లన్న ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లన్న విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన ఆయన, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఎల్లన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి నిస్వార్థ సేవలు అందించిన మహనీయుల ఆశయాలను స్మరించుకోవడం, వారి బాటలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎల్లన్న గారు చేసిన ప్రజా సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న ఆత్మీయ అనుబంధం ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథరెడ్డి, పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, తారాసింగ్‌లతో పాటు ఎల్లన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమంగా సంపాదించిన ఆస్తులు కూడా అప్పగించాలి : సామాజిక కార్యకర్తల డిమాండ్



కల్వకుర్తి, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి): సివిల్ సప్లై కార్పొరేషన్ నుంచి ధాన్యం పొందిన మిల్లర్లు తమ రైస్ మిల్లుల తాళాలతో పాటు అక్రమంగా సంపాదించిన ఆస్తులను కూడా జిల్లా కలెక్టర్ కు అప్పగించాలని కల్వకుర్తిలోని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వారి డిమాండ్లతో కూడిన పత్రికా కథనాలను చదివిన సామాజిక కార్యకర్తలు శనివారం స్పందిస్తూ మండిపడ్డారు. "మేము దోచుకుంటాం, దాచుకుంటాం, మమ్మల్ని ఎవరూ ప్రశ్నించవద్దు, ఎలాంటి కేసులు, అరెస్టులు చేయరాదు, అలా చేస్తే సహించబోమని మిల్లులకు తాళాలు వేసి కలెక్టర్ కు అప్పగిస్తాము" అనే తరహాలో వచ్చిన కథనం చూసి అవాక్కయ్యామన్నారు. దోచుకున్న వాడిని దొంగ అనక దొర అనాలా అని ఎద్దేవా చేశారు. వ్యాపారులు మిల్లులు నిర్మించక ముందు వారి ఆర్థిక పరిస్థితి, ప్రస్తుతం అనుభవిస్తున్న రాజభోగాలను పరిగణలోకి తీసుకొని పీడీ యాక్ట్, చీటింగ్, ప్రభుత్వ సొమ్ము కాజేసినందుకు రాజ్యాంగ పరిధిలో వివిధ సెక్షన్ల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి ఆస్తులను ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సూచించారు. సివిల్ సప్లై కార్పొరేషన్ నుంచి ధాన్యం తీసుకొని అమ్ముకొని ఆస్తులు కూడబెట్టుకోవడం జగమెరిగిన సత్యమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే ఒక్కో మిల్లు యజమాని రూ.40 నుంచి 50 కోట్ల విలువ గల ప్రజాధనం బాకీపడి వారి కుటుంబీకుల పేరు మీద ఆస్తులు కొనుగోలు చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. కల్వకుర్తి పట్టణంలోనే కొన్ని రోజుల క్రితం రెండు ఎకరాలు లీజుకు తీసుకొని కోట్ల రూపాయల విలువ గల ధాన్యం తీసుకొని అమ్ముకొని సొంత ఊర్లో ఫామ్ హౌస్ నిర్మాణానికి పావులు కదపడమే కాక కుటుంబీకుల పేరు మీద ఉన్న ఆస్తులను బినామీ పేర్ల మీదకు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నది నిజం కాదా అని నిలదీశారు. మొలకెత్తిన ధాన్యం ద్వారా నష్టపోయామని చెప్పుకుంటున్న వ్యాపారులు సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా ధాన్యం పొంది నష్టపోయిన ఒక్క మిల్లర్‌నైనా చూపిస్తారా అని మండిపడ్డారు. గతంలో కార్పొరేషన్ కు బియ్యం అప్పగించడంలో సమయం కావాలని హైకోర్టులో స్టే తెచ్చుకున్నారని, ఇప్పుడు కాలయాపన చేస్తూ ప్రభుత్వ సొమ్మును కాజేయాలనే ఉద్దేశంతో అధికారులపై, ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు చూపడం సరికాదన్నారు.

"మేము తప్పు చేస్తాం, మాకు శిక్షలు వేయడం తప్పు, మాకు రాజ్యాంగం వర్తించదు" అన్న చందంగా రైస్ మిల్లుల అసోసియేషన్ వ్యవహార శైలి ఉందని విమర్శించారు. ఇప్పటికైనా బాధ్యత గల అధికారులు మిల్లర్ల డిమాండ్లకు తలొగ్గకుండా కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ సొమ్మును ప్రజా ఖజానాకు చేర్చాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

# సింగారంలో బోనాల మహోత్సవానికి ఘన ఏర్పాట్లు - సర్పంచ్ నీలం శేఖర్



అచ్చంపేట, సెప్టెంబర్ 04: (వుదయం ప్రతినిధి )నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో సోమవారం జరగనున్న బోనాల మహోత్సవానికి గ్రామ సర్పంచ్ నీలం శేఖర్ ఆధ్వర్యంలో ఘన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఈ మేరకు గ్రామంలోని అమ్మవారి విగ్రహాలకు రంగులు వేసి, నూతన శోభను తీసుకొస్తున్నారు. బోనాల మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

సోమవారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి, గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కుకోనున్నారు. ఈ కార్యక్రమం సర్పంచ్ నీలం శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది

# బీజీఆర్ హైస్కూల్‌లో ఘనంగా విద్యార్థి నాయకుల పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమం

**విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం**




అయిజ (వుదయం) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని స్థానిక బీజీఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ప్రవర్తన, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించే సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి అయిజ సబ్‌ఇన్‌స్పెక్టర్ గురుస్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్. బాల వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావులతో కలిసి నూతనంగా ఎంపికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు వివిధ విభాగాల విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్ఐ గురుస్వామి మాట్లాడుతూ నాయకత్వం అనేది కేవలం హోదా మాత్రమే కాదని, బాధ్యతను గుర్తెరిగి తోటివారికి ఆదర్శంగా నిలవడమే నిజమైన నాయకత్వమని పేర్కొన్నారు. అందరినీ కలుపుకుపోతూ, సరైన నిర్ణయాలు తీసుకుంటూ, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కరస్పాండెంట్ ఎస్. బాల వెంకటరెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని, పాఠశాల నియమ నిబంధనలకు కట్టుబడి ఆదర్శంగా మెలగాలని సూచించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు నాయకత్వం, క్రమశిక్షణ, సేవాభావం వంటి ఉన్నత విలువలను నేర్పించడమే పాఠశాల ప్రధాన ధ్యేయమని స్పష్టం చేస్తూ, విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన విద్యార్థి నాయకులతో ఘనంగా ప్రమాణ స్వీకారం చేయించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నూతన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం - మంత్రి సీతక్క

**- కొల్లాపూర్ లో రూ.175 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ**



కొల్లాపూర్ (వుదయం) : మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి సొంత కాళ్లపై నిలబడేలా రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందనీ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌లతో కలిసి రోడ్డు, సోలార్ విద్యుత్ ప్లాంట్ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం రాజాగారి బంగ్లా ఆవరణలో ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళా సంఘాలకు కేవలం రుణాలకే పరిమితం చేయకుండా యూనిఫాంల తయారీ, వరి కొనుగోళ్లు, సోలార్ ప్లాంట్ల ద్వారా నెలకు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం కల్పిస్తున్నామని, జిల్లా కేంద్రంలో రూ.6 కోట్లతో ఇందిర మహిళా శక్తి భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రూ.600 కోట్లతో రోడ్లు, రూ.50 కోట్లతో విద్యుత్ లైన్లు, రూ.200 కోట్లతో జెట్ పోల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్, పేదలకు రూ.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని చెబుతూ, ప్రజలు ఆడంబరాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ జూపల్లి నేతృత్వంలో నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, సామాజిక న్యాయం కోసం కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.175 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులతో పాటు గొర్రె పిల్లలు, నాటుకోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత మద్యం విక్రయం ఆపెదెవరు?

**"యథేచ్ఛగా మద్యం విక్రయాలపై మహిళా సంఘాల ఆగ్రహం"**




కోహిర్ (వుదయం) : కోహిర్ మండలం పరిధిలోని పలు గ్రామాలు, పట్టణ కాలనీల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణపై స్థానిక మహిళలు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ మద్యం విక్రయాల వల్ల మహిళలు, విద్యార్థులు, యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బెల్ట్ షాపులపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులను నియంత్రిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు రెండేళ్లు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని మహిళలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార కేంద్రాల్లోనూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని, లైసెన్స్డ్ మద్యం షాపుల నుంచే వీటికి సరఫరా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం సులభంగా అందుబాటులో ఉండటంతో మద్యం ప్రియులు ఉదయం నుంచే తాగుతూ, రోడ్లపై పడిపోతూ, గొడవలకు దిగుతూ హల్‌చల్ చేస్తున్నారని, దీంతో సాయంత్రం వేళల్లో వృద్ధులు, మహిళలు బయటకు రావడానికి భయపడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలిసిన వారికి అప్పుగా మద్యం ఇస్తుండటంతో యువత తాగుడుకు బానిసలై కుటుంబాలపై ఆర్థిక భారం పెంచుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఈ అక్రమాలపై ఎక్సైజ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసినా వారి మౌనం వెనుక పలు అనుమానాలు ఉన్నాయని, అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించి, కోహిర్ మండలంలో బెల్ట్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చటపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, మహిళలు కోరుతున్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



తెలకపల్లి సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి) తెలకపల్లి లోని సిద్ధార్థ మోడల్ స్కూల్, కే క్ రెడ్డి పాఠశాలలో తోపాటు పలు విద్యాసంస్థల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఈ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అంతేకాకుండా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నటువంటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మించబడుతుందనే అంశాన్ని వక్తలు ప్రస్తావించారు. విద్యార్థులకు నిత్యం విద్య బోధన చేస్తూ విజ్ఞాన అందించడంతోపాటు దశ దిశా నిర్దేశించి మంచి మార్గంలో నడిపించే ఘనత ఉపాధ్యాయులకు దక్కుతుందని అభిప్రాయపడ్డారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం లో ఎంపీ



నారాయణఖేడ్ సెప్టెంబర్ 05(వుదయం) : నారాయణఖేడ్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎంపీ సురేష్ కుమార్ సెట్కార్ పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సభావట్ రమేష్ ,జ్యోతి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. నూతన గృహాల్లో వారు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి సి సి సభ్యులు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ మాలి పటేల్ మారుతి, మాజీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ లక్ష్మి భాయి, చందర్ నాయక్, గ్రామ ఉప సర్పంచ్ ఆన్సీ బాయి వెంకట నాయక్, కాంగ్రెస్ పలు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు గ్రామ వాడు నెంబర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నవ సమాజ నిర్మాత ఉపాధ్యాయుడే

**– మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు**



దౌల్తాబాద్, సెప్టెంబర్ 5(వుదయం): నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. తిరుమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుడు సమాజానికి ఆదర్శప్రాయుడని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత బాధ్యతాయుతమైన వ్యక్తి అని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా, నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చాలని సూచించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు.
ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను ఆయన స్మరించుకున్నారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం ఉపాధ్యాయ వృత్తికి ఇచ్చే గౌరవానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రజిని, శ్రీనివాస్, నగేష్, నరేందర్, శ్రీనివాస్, సీఆర్‌పీ నగేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు బీమాను కొనసాగించాలి : తిమ్మాపూర్ రైతు ఆంజనేయులు ముదిరాజ్



శివ్వంపేట సెప్టెంబర్ 5 (వుదయం) : వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతు కు రైతుభీమగ గత ప్రభుత్వము ప్రవేశపెట్టిన రైతు బీమా ను పునరుద్ధించాలని మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు పోల్దాస్ ఆంజనేయులు ముదిరాజ్ డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని రైతు బీమా ను ప్రవేశపెట్టి రైతులకు భరోసాగా నిలిచింది. ఇట్టి రైతు బీమా పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం గత నెల 13వ తారీకు అర్ధరాత్రి నుండి తీసివేశారు. దేశానికి అన్నం పెట్టే రైతు అలాంటి రైతుకు వెన్నెముక గా నిలిచిన రైతు బీమా పథకం తీసివేయడంతో రైతు అనివర్య కారణాలవల్ల రైతును కోల్పోతే రైతు కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండిపోతుందని వీటిని దృష్టిలో పెట్టుకున్న గత ప్రభుత్వం రైతుకు పెద్దదిక్కుగా ఉన్న రైతు బీమా పథకాన్ని ఈ ప్రభుత్వం తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రైతు లేనిదే రాజ్యం లేదు రాజులకైనా 5 వ్రేలు నోటి కాడికి పోవాలంటే రైతే ముఖ్యమని రైతులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు ఎప్పుడూ నిలవయని వీటిని దృష్టిలో పెట్టుకొని రైతు బీమాను యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

## చెన్నకేశవ స్వామికి ఘనంగా అభిషేకం



తెలకపల్లి (వుదయం) : మండలం కమ్మరెడ్డిపల్లి లో శనివారం సగరుల ఆరాధ్య దైవమైన చెన్నకేశవ స్వామి కి ఘనంగా పంచామృతాలతో అభిషేకం తోపాటు గండ దీప కార్యక్రమాన్ని నిర్వహించారు. గోవింద నామస్మరణతోఈ గండ దీపాన్ని ఊరే ఊరేగింపుగా చెన్నకేశవ స్వామి ఆలయానికి తీసుకువెళ్లి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ఈ గండదీప మహోత్సవాన్ని నిర్వహించడం ఆన వాయితిగా వస్తున్న ఆచారం. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు




సిద్దిపేట, సెప్టెంబర్ 5 (వుదయం బ్యూరో) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సుదర్శన్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్దిపేట ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా ఎన్సాన్‌పల్లి గ్రామంలోని తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (సిద్దిపేట) కార్యదర్శి సౌజన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని, మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవడంలో ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తారని తెలిపారు. అలాగే విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం, తమ హక్కులు మరియు బాధ్యతలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ (సిద్దిపేట) రవి కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణు వర్ధన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపు ఎప్పుడు?

**గుర్తింపు ప్రక్రియలో లోపారిపాట్లు వద్దు.. అర్హులైన ప్రతి**




గద్వాల (వుదయం) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను, జీవితాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల త్యాగాలకు ఇకనైనా తగిన గుర్తింపు లభించాలని, ఈ గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి రాజకీయ జోక్యం, వివక్ష లేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల కన్వీనర్ షేక్ ఫారుక్ హుస్సేన్ డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో శ్రీ అతికూర్ రహమాన్ అధ్యక్షతన నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా ఉద్యమకారుల సమస్యలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తంచేస్తూ, ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని కమిటీ నిష్పక్షపాతంగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు దక్కేలా చూడాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం రూ. 2 వేల కోట్ల బడ్జెట్‌తో ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఉచిత ఇంటి స్థలం, ఇల్లు కట్టుకోవడానికి రూ. 25 లక్షల ఆర్థిక సాయం, నెలకు రూ. 25 వేల పెన్షన్ అందించడంతో పాటు వారి పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టం చేశారు. అనంతరం, జోగులాంబ గద్వాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, జిల్లా అధ్యక్షుడిగా శ్రీ అతికూర్ రహమాన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. ప్రభాకర్ ఎంపికయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు నాగర్ దొడ్డి వెంకట రాములు, భీం సేన్ రావు, అబ్దుల్ రవుఫ్, అచ్చన్న గౌడ్, బి. ఆంజనేయులు, తాహెర్, వినోద్, ముహమ్మద్ రహమతుల్లా, గోపాల్ యాదవ్, టవర్ మక్బూల్, రంగు సుమలతతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 6న కరీంనగర్ లో 50 వేల కార్మికులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ - తరలిరండి




నాగర్ కర్నూల్ (వుదయం) : కార్మికుల హక్కుల సాధనకై ఈ నెల 6న కరీంనగర్ పట్టణంలో నిర్వహించే 50 వేల మంది రాలీ, భారీ బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుండి కార్మికులు వేలాదిగా తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. 'హలో కార్మిక.. చలో కరీంనగర్' నినాదంతో ఈ సభలు జరుగుతాయని, ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణ ఆచారి భవన్ లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో కరీంనగర్ లో ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలు అంగరంగ వైభవంగా జరుగుతాయని, ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్ హాజరవుతారని తెలిపారు. అంతేకాకుండా సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఇంచార్జ్ వీఎస్ బోస్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎస్. బాలరాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహతో పాటు దాదాపు 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఏఐటీయూసీ 105 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, సంస్థ సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే అనేక కార్మిక చట్టాలు సాధించుకున్నామని పేర్కొన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వ్యవస్థల రద్దు, పర్మినెంట్ ఉద్యోగాలు, మున్సిపాలిటీ, పంచాయతీ కార్మికులకు ప్రతీ నెల 1వ తేదీన వేతనాలు, సెలవుల వంటి డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చిందని, ఆగస్టు 24 బంద్ పిలుపుతో ఆటో కార్మికుల సంక్షేమం కోసం 13 రకాల ప్రయోజనాలతో బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఈర్ల హుస్సేన్, కొత్త రామస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, చారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గుడేబల్లూర్ లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నారాయణపేట సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి) : క్రిష్ణ మండలం గుడెబల్లూర్ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయము నుండి విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషాధారణలతో కోలాటం వేసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ఉట్టి కొట్టే ప్రాంగణానికి చేరుకున్నారు.అక్కడ సాయంత్రం 6: 30 గంటల ప్రాంతంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగులు చల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడెబల్లూర్ సర్పంచ్ మహాదేవమ్మ ,ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీలు,కరస్పాండెంట్ బి. నర్సిములు, అధ్యక్షులు ప్రహ్లాద రెడ్డి, పేరెంట్ కమిటీ అధ్యక్షులు పూజారి లక్ష్మణ, మాగనూర్ మార్గదర్శి విద్యాలయ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, గుడెబలుర్ మార్గదర్శి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ భీమ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలత, ఉపాధ్యాయులు రేణుక, చైతన్య ,వర్ష ,భవాని, మహేశ్వరి, నిఖిత ,నాగమ్మ ,నవీన్ కుమార్ రెడ్డి ,లక్ష్మణ్ ,సురేష్ లతోపాటు పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గుడేబల్లూర్ లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాధాకృష్ణ భవన్, విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మహోపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాలో జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. జాతీయ అవార్డు గ్రహీత మంతటి నారాయణ (అచ్చంపేట), రాష్ట్ర అవార్డు గ్రహీతలు యశోద రెడ్డి (నాగర్ కర్నూల్), వివేకానంద, రఘురాం గౌడ్ (కల్వకుర్తి) లను సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమ సర్వీసులో విద్యార్థులకు అందించిన సేవలకు గుర్తింపుగా అవార్డులు వచ్చాయని, పదవీ విరమణ తర్వాత కూడా గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు సోమిశెట్టి శ్రీధర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజాన్ని సన్మార్గంలో నడిపించే వారని, రాధాకృష్ణన్ ఆదర్శాలను నేటి గురువులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటశెట్టి, బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, జంగి రెడ్డి, పాండు, నర్సయ్య, పాపిరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# వద్దేమాన్ లో శ్రీ శనేశ్వర స్వామికి వైభవంగా శ్రావణ నవమి తిల తైలాభిషేక పూజలు

**- పరమశివునికి రుద్రాభిషేకాలు**



బీజినేపల్లి (వుదయం) : మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో వెలిసిన శ్రీ సార్థ సప్త జేష్ఠమాత సమేత శనేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస కృష్ణ పక్ష శ్రావణ నవమి శనివారం, మృగశిర నక్షత్ర పుణ్య ఘడియలను పురస్కరించుకుని తిల తైలాభిషేక పూజలు వైభవంగా జరిగాయి. శనిగ్రహ దోష నివారణ కోసం భక్తులు వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి భక్తిశ్రద్ధలతో తైలాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ.. ఈ పవిత్ర మాసంలో స్వామివారిని ఆరాధిస్తే భక్తులకు విశేష ఫలితాలు లభిస్తాయని, జన్మరీత్యా, గోచార రీత్యా ఉన్న శనిగ్రహ దోషాల నివారణకు ప్రతి ఒక్కరూ శక్తి మేరకు స్వామివారిని పూజించాలని ఉద్ఘాటించారు. ఇదే ఆలయంలో చారిత్రక గోన బుద్ధారెడ్డి కాలం నాటి బ్రహ్మసూత్రం కలిగిన పరమశివునికి భక్తులు భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించగా, నందీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ మహోత్సవంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# పేట చేనేత సొసైటీ లో ప్రభుత్వ సొమ్ము లూటీ



నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి)పట్టణంలోని చేనేత సహకార సంఘాల్లో అక్రమ లావాదేవీలు జరుపుతూ సంఘాల పెద్దలు ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్నారని, మరోవైపు చేనేత కార్మికులను తీవ్రంగా మోసం చేస్తున్నారని చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు కెంచి నారాయణ ఆరోపించారు. సొసైటీలలో జరుగుతున్న అక్రమాలపై కార్మికులు ఐక్యమై పోరాటానికి ముందుకు రావాలని పిలుపునిస్తూ శనివారం పట్టణంలోని బురుడు వాడి వీధిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మిక హక్కుల సాధన, సంక్షేమం కోసం సెప్టెంబర్ 9న నారాయణపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న చేనేత కార్మికుల మహాధర్నాను అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బహుజన సమాజ్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ అధ్యక్షులు దాసరి అశోక్, సీపీఎం జిల్లా నాయకులు కే. కాశప్ప, నరహరి మాట్లాడుతూ అర్హులైన చేనేత కార్మికులకు సొసైటీలలో సభ్యత్వం కల్పించడంతో పాటు మగ్గాలను అందించాలని, ఎన్నో ఏళ్లుగా అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగుతున్న వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే జియో ట్యాగింగ్, నేతన్న బీమా యోజన పథకాలలో జరుగుతున్న తీవ్ర అక్రమాలపై విచారణ జరపాలని కోరారు. సొసైటీల్లో అక్రమాలు, కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంకకు వినతిపత్రం అందజేసినా స్పందించకపోవడం వల్లే కలెక్టరేట్ ధర్నాకు పూనుకుంటున్నామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు యాబన్న చౌదరి, వద్ది నారాయణ, క్యాతన్ తిమ్మన్న, తులసి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి అండగా మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు

**సర్జరీతో కోలుకుంటున్న అనిత ను పరామర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్**



రామాయంపేట, సెప్టెంబర్ 5 (వుదయం) : మానవీయ విలువలతో కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు చాటి చెప్పారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జర్నలిస్ట్ భైరవరెడ్డి భార్య అనితను శనివారం ఆమె నివాసంలో చైర్‌పర్సన్ పరామర్శించారు. ఈ సందర్భంగా అనిత ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, తక్షణ సహాయంగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు నిరంతరం శ్రమించే జర్నలిస్టుల కుటుంబాలకు కష్ట సమయంలో అండగా నిలవడం మనందరి బాధ్యత అని, వారికి ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆపద కాలంలో తోడుగా నిలిచి ఆప్యాయత చూపిన చైర్‌పర్సన్‌కు జర్నలిస్ట్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్ భైరం స్వప్న కుమార్, కో-ఆప్షన్ సభ్యులు చింతల రాధా భవాని యాదగిరి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పోచమ్మల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తిని కించపరిచే వ్యాఖ్యలు బాధాకరం : రాగి రాములు

**కాంగ్రెస్ ఎమ్మెల్యే వెంటనే ఉపాధ్యాయ సమాజానికి క్షమాపణ చెప్పాలి**



రామాయంపేట (వుదయం) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపాటి సత్యనారాయణ ఉపాధ్యాయ వృత్తిపై అవమానకరంగా మాట్లాడటం తీవ్రంగా బాధాకరమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు అన్నారు. శుక్రవారం ఆయన రామాయంపేటలో ఒక ప్రకటన విడుదల చేస్తూ, కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత గౌరవం పొందుతున్న పవిత్రమైన వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి ఒకటని, విద్యార్థులకు జ్ఞానాన్ని అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేసే గురువులను గౌరవించాల్సిన రోజునే ఒక ప్రజాప్రతినిధి ఆ వృత్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. రాజకీయ నాయకులపై విమర్శలు చేసుకోవడంలో ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే వ్యక్తిగత లేదా రాజకీయ విమర్శల పేరుతో ఒక పవిత్రమైన వృత్తినే కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఏ అంశంపై మాట్లాడినా సంయమనం, బాధ్యత, పద్ధతిని పాటించాలని సూచించారు. లక్షలాది మంది ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం వారి మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగులు కాదని, భావితరాలను తీర్చిదిద్దే శిల్పులని, సమాజానికి దిశానిర్దేశం చేసే గురువులని కొనియాడారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఉపాధ్యాయ వృత్తికి ఉన్న గౌరవాన్ని కాపాడాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమాజానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపాటి సత్యనారాయణ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాగి రాములు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# కేసీఆర్ దిష్టిబొమ్మ దహనంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం: వంటేరు ప్రతాప్ రెడ్డి




తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన శనివారం ఫిర్యాదు చేశారు.

అనంతరం వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి మరియు వారి అనుచరులపై వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే, 10 వేల మందితో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర చేపట్టి ఇందిరా పార్క్ వద్ద దహనం చేస్తామని హెచ్చరించారు. అధికారంలో ఉండి కూడా హామీలు నెరవేర్చలేక, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ నేతలు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను రాజీనామా చేయమనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మండల అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# కొల్లాపూర్ లో కాగితపు, సిమెంట్ పరిశ్రమల్ని నెలకొల్పాలి




కొల్లాపూర్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ధ్వజమెత్తారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, విద్యార్థి, రైతు, కార్మిక సమస్యలను గాలికొదిలేసి, ప్రశ్నించే వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. పేపర్ లీకేజీలు, అవినీతి, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడంపైనే ప్రధాని మోదీ దృష్టి సారించారని ఆరోపించారు. మరోవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, గత పాలకులపై నిందలు వేస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. కొల్లాపూర్ ప్రాంతంలో కాగితపు, సిమెంట్ పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి, మిషన్ భగీరథ, కేఎల్ఐ వంటి ప్రాజెక్టులలో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఇవ్వకుండా, ఇతర రాష్ట్రాల వలస కార్మికులతో చాలీచాలని వేతనాలతో పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసుకుంటున్న అటవీ భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, జీల్దార్, తిప్ప చెరువులకు సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కొల్లాపూర్ మండల కార్యదర్శి పి. శివవర్మ, జిల్లా కమిటీ సభ్యులు ఎం. తార సింగ్, మండల కమిటీ సభ్యులు ఎండి సలీం, రామకృష్ణ, శంకర్, సాయికుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ పంట నమోదుపై అధికారుల పరిశీలన : ఏవో ప్రవీణ్ కుమార్

**పంటల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి : వ్యవసాయ అధికారి**



రామాయంపేట (వుదయం) : మండల పరిధిలోని ప్రగతిధర్మారం గ్రామంలో కొనసాగుతున్న డిజిటల్ పంట సర్వే (డిజిటల్ క్రాప్ సర్వే) ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఆన్‌లైన్ పంట నమోదు పురోగతిని పరిశీలించి, నమోదు ప్రక్రియపై సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేందుకు ప్రభుత్వం ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక పంట నమోదు సిబ్బందిని నియమించిందని, నియమిత సిబ్బంది నేరుగా రైతుల పొలాలను సందర్శించి సాగు చేస్తున్న పంట రకం, సర్వే నంబర్, విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ డిజిటల్ నమోదు వివరాల ఆధారంగా ప్రభుత్వం పంటల ఉత్పత్తిని అంచనా వేయడంతో పాటు, అవసరమైన సమయంలో పంటల కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కాబట్టి ప్రతి రైతు తమ సాగు వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని, పంట నమోదు సిబ్బంది గ్రామానికి వచ్చిన సమయంలో రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి సరైన వివరాలను అందించి ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని కోరారు. పంట వివరాల నమోదులో రైతులు సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయికృష్ణ, డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) వాలంటీర్ కుమ్మరి నరేష్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల

**చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల**



నాగర్‌కర్నూల్ (వుదయం) : తెలంగాణ రాష్ట్ర టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లో తలపెట్టిన "చలో హైదరాబాద్" భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీజీ జేఏసీ జిల్లా చైర్మన్ భావండ్ల వెంకటేష్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి, 'చలో హైదరాబాద్' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీష్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాస్ రావుల నాయకత్వంలో జరుగుతున్న ఈ "ఉద్యోగుల జంగ్ సైరన్" సభ ద్వారా ఉపాధ్యాయ, ఉద్యోగ హక్కులను సాధించుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. నూతన పీఆర్సీ సాధన, పెండింగ్ బిల్లుల తక్షణ విడుదల, ఈహెచ్ఎస్ కార్డుల పూర్తి స్థాయి అమలుతో పాటు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ సాధించడమే ధ్యేయంగా ప్రతి ఒక్క ఉద్యోగ, ఉపాధ్యాయుడు హైదరాబాద్‌కు తరలిరావాలని, పెన్షన్ అనేది ప్రతి ఉద్యోగి జన్మహక్కు అని నినదించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చలో హైదరాబాద్ సభను ముక్తకంఠంతో విజయవంతం చేసి, పోరాటాల ద్వారా హక్కులను సాధించుకుంటామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-చైర్మన్లు మధుసూదన్ రెడ్డి, ఎండి షర్ఫుద్దీన్, మునగాల సతీష్ కుమార్, సి.హెచ్ వెంకట్, సంజీవ, అమరేందర్ రెడ్డిలతో పాటు టీజీఈజేఏసీ నాయకులు బాలరాజు, నసీరుద్దీన్, గణేష్, జీకే వెంకటేష్, సురేష్ కుమార్, ప్రమోద్ కుమార్, మహేష్ తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

**రామాయంపేటలో ఉచిత జూట్ బ్యాగ్, మగ్గం శిక్షణకు శ్రీకారం**



రామాయంపేట,సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి): మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదిగేలా తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత జూట్ బ్యాగ్ తయారీ, మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, 40 రోజుల పాటు నిర్వహించే ఈ ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ఆసక్తి గల మహిళలు రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి శిక్షణలో చేరాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఏ. రవీందర్, మహిళా సాధికారిత సహాయ అధికారి నాగమణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిక్షణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, కొక్కు ప్రవీణ్, పుట్టి సందీప్, జంగంపల్లి శంకర్‌గౌడ్, దేవుని రంజిత్‌కుమార్ మరియు స్థానిక మహిళా సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు..

**ఉత్తమ ఉపాధ్యాయురాలిని అభినందించిన ఎస్పీ.**




మెదక్ (వుదయం): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిట్కూల్ కేజీబీవీ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఘన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ.. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల శ్రమ మరువలేనిదని కొనియాడారు. ఇదే వేదికపై జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఉమాదేవిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ఆమె సేవలను ప్రశంసించారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడిన ఎస్పీ.. బాలికల రక్షణ కోసం రూపొందించిన పోక్సో చట్టం, పెరుగుతున్న సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని హెచ్చరించారు. విద్యార్థినులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే 'పోలీస్ అక్క' దృష్టికి తీసుకురావాలని సూచించిన ఆయన, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎంఈఓ, సీఐలు సందీప్‌రెడ్డి, రంగాకృష్ణ, ఎస్ఐ నర్సింలు, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆగస్టిన్

**గణిత బోధనలో విశిష్ట సేవలకు గుర్తింపు ..**
**సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**




గద్వాల సెప్టెంబర్ 05 (వుదయం బ్యూరో) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం తప్పెట్లమొర్సు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఆగస్టిన్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఈ వేడుకలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో విధులను నిర్వర్తించాలని సీఎం పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయుడు ఆగస్టిన్‌కు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ యోగితా రానా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ చేతుల మీదుగా అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఆగస్టిన్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడం పట్ల గట్టు మండల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, విద్యాభిమానులు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం
# జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ (వుదయం) : వినాయక చవితి ఉత్సవాల వేళ ప్రజలంతా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి.జానకి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన ప్రత్యేక సైబర్ అవగాహన పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని, అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, నకిలీ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గణేష్ మండపాలను దర్శించే భక్తులలో చైతన్యం తెచ్చేందుకు ప్రతి మండపంలో ఈ సైబర్ అవగాహన పోస్టర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులను ఆదేశించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి.జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డి.ఆర్.ఓ ఏ.నిర్మల, కార్యాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమని తెలిపారు. శాంతియుత వినాయక చవితి, సైబర్ సురక్షిత సమాజం, పచ్చని పర్యావరణం లక్ష్యంగా అందరూ సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయ దినోత్సవానికి మొక్కలే ప్రత్యేక కానుక



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 05, వుదయం ప్రతినిధి: : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హౌసింగ్‌బోర్డు కాలనీలోని గీతాంజలి అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయ బహుమతులకు భిన్నంగా ఉపాధ్యాయులకు గులాబీ మొక్కలను అందించి పర్యావరణ పరిరక్షణతోపాటు గురువుల సేవలకు గౌరవం చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రిన్సీ జార్జ్ మాట్లాడుతూ.. గులాబీ మొక్క విద్యార్థుల ఎదుగుదలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మొక్కకు నీరు, పోషణ, సంరక్షణ అవసరమైనట్లే.. విద్యార్థుల భవిష్యత్తు వికాసానికి ప్రేమ, శ్రద్ధ, ప్రోత్సాహం, సరైన మార్గదర్శకత్వం అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులను విలువలతో తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల అసలైన బాధ్యత అన్నారు. కరస్పాండెంట్ చిదిరే నరేష్ ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. ఉపాధ్యాయుల ప్రేమ, శ్రద్ధతో విద్యార్థుల భవిష్యత్తు వికసించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిందని తెలిపారు.

# ఆధార్ కేంద్రాల్లో అదనపు రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు : ఈ డి ఎమ్ శివ




గద్వాల (వుదయం) : ఆధార్ కేంద్రాల్లో నిర్ణీత రుసుము కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ డి ఎమ్ శివ గద్వాల మండలంలోని ఐదు ఆధార్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆధార్ సేవల కోసం వచ్చిన ప్రజలతో ఆయన నేరుగా సంభాషించి, నిర్దేశిత రుసుము కంటే అదనంగా ఎవరైనా వసూలు చేస్తున్నారా అని ఆరా తీశారు. తనిఖీ సమయంలో అదనపు రుసుము వసూలు చేసినట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, సెంటర్లలో అందుతున్న సేవల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని ఈ డి ఎమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ డి ఎమ్ శివ మాట్లాడుతూ... ఆధార్ కేంద్రాల నిర్వాహకులు నిర్ణీత రుసుము కంటే అధికంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలతో ఫిర్యాదు అందితే, విచారణ జరిపి సదరు కేంద్రాలపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా ఆధార్ కేంద్రాలను సందర్శించి తమ సేవలను పొందాలని ఆయన సూచించారు. ఆధార్ సేవల పేరిట నిర్ణయించిన రుసుము కంటే అధికంగా డబ్బులు డిమాండ్ చేసినట్లయితే, ప్రజలు వెంటనే యుఐడిఎఐ హెల్ప్‌లైన్ నంబర్ 1947కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# రామాయంపేటలో ఘనంగా పుష్పయాగం
# పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్




రామాయంపేట (వుదయం) : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నాలుగో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని స్వామివారికి పుష్పయాగ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ఆలయాన్ని సందర్శించి, వివిధ రకాల సుగంధ పుష్పాలతో స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రామాయంపేట పట్టణ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రతి కుటుంబంలోనూ శాంతిసౌభాగ్యాలు వెల్లివిరియాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా స్వామివారికి కనులపండువగా నిర్వహించిన పుష్పయాగాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, బైరం స్వప్న కుమార్, చింతల రాధా భవాని యాదగిరి తదితరులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులే

**సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది.**
**దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి**



యాలాల (వుదయం) : విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది గురువులేనని గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని దేవనూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మాట్లాడుతూ.. గురువు లేని విద్య గుడ్డి దీపం లాంటిదని, నేటి సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, విశిష్ట స్థానం కలిగి ఉందని తెలిపారు. దేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని, భావి భారత పౌరులైన విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను, అంగన్వాడీ టీచర్లను, పాఠశాల పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మంత్రి వెంకటయ్య, బీఆర్ఎస్ యువ నాయకులు మెట్లి కృష్ణ, కిరణ్ కుమార్, బోడ్కా మల్లేశం, V. గోపాల్, సూర్య ప్రకాష్, మెట్లి నరేష్, సురేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే దేశ ప్రగతి..
# విద్యార్థులే దేశ భవిష్యత్ శిశు



**సేవా స్ఫూర్తికి ప్రతీకగా రూ.5 లక్షల విరాళం విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించాలి ఆర్ బి ఓ ఎల్ సీఈఓ బియ్యాని శ్రీనివాస్ రెడ్డి**

తాండూర్ సెప్టెంబర్ 5 వుదయం ప్రతినిధి : విద్యార్థులే రేపటి భవిష్యత్ భారత నిర్మాతలని RBOL సీఈఓ బియ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు ఆయన రూ.5 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. చెక్కు రూపంలో విరాళాన్ని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా బియ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడంలో సరస్వతీ విద్యాపీఠం, శిశు మందిర్ విద్యాలయాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాలలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. శిశు మందిర్ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తుందనే నమ్మకంతో ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం కొనసాగిస్తానని బియ్యని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు డా. మల్లేశం, శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు కటకం వీరేందర్, యాజమాన్య కమిటీ సభ్యులు పెరుమాళ్ల రాం రెడ్డి, అనంత రెడ్డి, జి. నరేందర్, కౌన్సిలర్లు జుంటుపల్లి వెంకట్, ఎం. రామకృష్ణ, ఎన్. రాజు గౌడ్, విద్యావేత్త పర్యాద రామకృష్ణ, భీం శెట్టి మధుసూదన్, సుబ్బారావు, ప్రభుశంకర్, మాజీ కౌన్సిలర్ జుబేర్ లాల, జోషి వికాస్, ప్రహ్లాద్, సమద్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శనివారం కూరగాయల మార్కెట్లో 'బాకీ కార్డు'ల పంపిణీ

**బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుద్ధ నాగరాజు**




సిద్దిపేట/జగదేవపూర్ (వుదయం) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జగదేవపూర్ మండల అధ్యక్షుడు బుద్ధ నాగరాజు తీవ్ర స్థాయిలో విమర్శించారు. శనివారం మేజర్ పంచాయతీ జగదేవపూర్ గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ 'బాకీ కార్డు'ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ నాగరాజు, మాజీ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను వంచిస్తోందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధే తప్ప ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని, రాష్ట్ర ప్రజలంతా మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని వారు స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికార పార్టీ నాయకులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేయడం వారి చేతకానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మచ్చ గణేష్, వార్డు సభ్యులు మచ్చ బాబు, బచ్చలి భాస్కర్, బండ శ్రీనివాస్, బాల్నర్సయ్య, డప్పు సాయి, ఇస్మాయిల్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య, కొంపల్లి మహేష్, సూరమ్మగారి వెంకట్ రెడ్డి, ప్రశాంత్, బాలకృష్ణ, ఐలయ్య, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ హామీల అమలుపై బిఆర్ఎస్ చేపట్టిన ఈ 'బాకీ కార్డు'ల పంపిణీ కార్యక్రమం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# వెయ్యి రోజుల దగాపై పోరుబాట!





**వేములవాడ, సెప్టెంబరు 05 (ఉదయం ప్రతినిధి) :**

విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శనివారం వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్.. వెయ్యి రోజుల దగా' పేరుతో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు,తెలంగాణ చౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థులు, యువతతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ చౌక్ నుంచి త్రినేత్ర ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. 'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు చేశారు,ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులను ఆకట్టుకునేలా కాంగ్రెస్ పలు హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి హామీల పరిస్థితిపై యువతకు సమాధానం చెప్పాలన్నారు విద్యార్థుల ఉన్నత విద్య కోసం రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు,

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో జీఓ నంబర్ 97 వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు, అలాగే మెగా డీఎస్సీ నియామకాలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని చల్మెడ ఆరోపించారు, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చినా ఆ దిశగా ప్రభుత్వం ముందుకు సాగడం లేదన్నారు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిరుద్యోగ భృతి హామీ అమలుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు, స్వయం ఉపాధి పథకం కింద రూ.10 లక్షలు, ప్రతి ఇంటికి ఉచిత ఇంటర్నెట్ వంటి హామీల పరిస్థితి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు,రుద్రంగి మండలంలో సుమారు రూ.45 కోట్లతో ఏటీసీ ఏర్పాటుకు భూమిపూజ జరిగినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.

రాజన్న ఆలయంలో కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు,విద్యార్థులు, యువత తమ హక్కుల కోసం ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని చల్మెడ అన్నారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ పోరాటంతోనే హక్కులు సాధించుకోవచ్చని యువతకు సూచించారు. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం హామీలను అమలు చేయాలని, ఖాళీ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వెంగల అనిత, శ్రీకాంత్‌గౌడ్, వాసాల లావణ్య, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, మారం కుమార్, గోలి మహేష్, నాయకులు గూడూరు మధు, క్రాంతికుమార్, పోతూ అనిల్, పసుల అంజి, మండలాల అధ్యక్షులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువ సమరభేరి సభకు కదం తొక్కి కదిలిన యువత

- కరీంనగర్‌లో బీఆర్ఎస్ యువ సమరభేరి సభ
- రెండు లక్షల ఉద్యోగాల ఇస్తాను అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నిరుద్యోగ యువతను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**కరీంనగర్ సెప్టెంబర్ 05 (ఉదయం ప్రతినిధి):**

రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు కరీంనగర్ వేదికగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ 'యువ సమరభేరి' సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు కేవలం ఒక్కరిని బర్తరఫ్ చేయడం కాదని, రాబోయే రోజుల్లో ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే బర్తరఫ్ కానుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని విమర్శించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ సమస్య: నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు అడిగితే యువతపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని, నోటిఫికేషన్లు పోయి 'లూటిఫికేషన్లు' బ్రహ్మాండంగా నడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ.. ఎక్కడున్నావు.. హైదరాబాద్‌కు ఎందుకు రావు?" అంటూ నిలదీశారు. మోచేతికి బెల్లం పెట్టి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ యువతను మోసం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, చేతకాని పాలనతో ప్రజలను నట్టేట ముంచారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోతే సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ భారీ బహిరంగ సభకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థి సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

## హైమాక్స్ లైట్స్ ఏర్పాటు , అధికారులకు ధన్యవాదాలు : ఇజ్జగిరి గంగాధర్

**మల్యాల మండలం సెప్టెంబర్ 05 ( ఉదయం ప్రతినిధి )**



జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామంలోని మూడో వార్డ్ లో శనివారం హైమాక్స్ లైట్ ని ఏర్పాటు చేసినందుకు , వార్డ్ సభ్యుడు ఇజ్జగిరి గంగాధర్ సర్పంచ్ గతం అంజయ్య , కాంగ్రెస్ నాయకులు దిండు ప్రవీణ్ లకి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నో రోజుల నుండి మూడో వార్డ్ కాలనీ వాసులు వీధి లైట్స్ లేక ఇబ్బంది పడుతున్న దృశ్య గంగాధర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపారని కాలనీ వాసులు తెలిపారు.

## అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా...

**కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు**

**మల్లాపూర్ సెప్టెంబర్ 05 (ఉదయం విలేకరి)**





మల్లాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు లు పాల్గొన్నారు అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన్ రేషన్ కార్డుల మంజూరు పేదలు కూడా కడుపునిండా తినాలని ఆలోచనతో రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తు అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు వరంగల్ డిక్లరేషన్ లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేయడం జరిగిందని గత పదివేల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రైతుకు కూడా రైతు రుణమాఫీ కాలేదన్నారు రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రైతులు ఎవరు అధైర్యపడవద్దని తెలిపారు ఆరోగ్య శ్రీ పథకాన్ని ఐదు లక్షల నుంచి పది లక్షల కు పెంచడం జరిగిందని తెలిపారు రాష్ట్రంలో పేదల సొంతింటి కల నెరవేర్చాలని లక్ష్యంతో అర్హులైన వారందరికీ ఇందిరమైన పోస్టింగ్ పత్రాలు అందజేయడం జరిగిందని ప్రోస్టింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని నిర్మాణాలు ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమ పుతాయన్నారు అనంతరం జగిత్యాల జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జువ్వాడి నర్సింగరావు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు ఆయురారోగ్యాలతో సంతోషంగా మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గంగుల రణధీర్

**కోరుట్ల సెప్టెంబర్ 05 (ఉదయం ప్రతినిధి)**

కోరుట్ల మండలం యూసుఫ్ నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గంగుల రణధీర్ సేవలను గుర్తించి విద్యాధికారులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుకు ఎంపిక చేశారు గత 24 సంవత్సరాల సర్వీస్ కాలంలో అయన విద్యారంగంలో వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలందించినందులకు గాను ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శనివారం జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అడిషనల్ కలెక్టర్ బి రాజగౌడ్ జిల్లా విద్యాధారి కె రాము గంగుల రణధీర్ ను జిల్లా ఉత్తమ అవార్డుతో సత్కరించారు.గంగుల రణధీర్ గతంలో కోరుట్ల మండలంలోని ఎంపీపీఎస్ అల్లమయ్యగుట్ట ఎంపీపీఎస్ సర్పరాజ్ పూర్ ప్రస్తుతం ఎంపీపీఎస్ మాదాపూర్ కాలనీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించి విద్యారుల ఎన్రోల్మెంట్ ను గణనీయంగా పెంచి సర్కారు బడులకు జీవం పోశారు పాఠశాలల్లో విద్యార్థులకు వినూత్న పద్ధతుల్లో సులభంగా అర్థమయ్యేలా విషయాలవారి ప్లేవే మెథడ్ లో నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేశారు అలాగే జిల్లా మండల రిసోర్స్ పర్సన్ గా రీడ్ క్లిప్ క్లాప్స్ వర్క్ ఎక్స్పీరియన్స్ విద్యా వాలంటీర్ క్యూఐపీ ఎల్ఈపి సీసీఈ స్నేహ బాల ఎఫ్ఎల్ఎన్ ఎఫ్ఎల్ఎస్ వంటి ఎన్నో శిక్షణలు ఉపాధ్యాయులకు అందించారు ఈ సందర్భంగా గంగుల రణధీర్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని అవార్డు స్వీకరణతో తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు తన సేవలను గుర్తించిన జిల్లా మండల విద్యాధికారులకు ఉపాధ్యాయ సంఘ బాద్యులకు ఉపాధ్యాయులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సెప్టెంబర్ 9న జాబ్ మేళానిర్వహణ

**జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్**

**పెద్దపల్లి, సెప్టెంబర్-05 (ఉదయం ప్రతినిధి)**



సుభగృహ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం సెప్టెంబర్ 09వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ 233, పెద్దపల్లిలో సెప్టెంబర్ 09వ తేదీన ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. సుభగృహ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ మేనేజర్స్, టెలీకాలర్స్ పోస్టులకు ఖాళీలు ఉన్నాయని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ మేనేజర్స్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ విద్యార్హత కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని, ఈ పోస్టులకు నెలకు రూ.15,000 నుంచి రూ.18,000 వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. టెలీకాలర్స్ పోస్టులకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ పోస్టులకు నెలకు రూ.15,000 వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 09వ తేదీన ఉదయం 10 గంటలకు తమ సీవీ/రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ జిరాక్స్, అనుభవ ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 8985336947,8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తాటిపల్లి గురుకులంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..!!

**మల్యాల మండలం సెప్టెంబర్ 05 ( ఉదయం ప్రతినిధి )**



జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గురుకులంలో ప్రిన్సిపాల్ మానస ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ / బైపీసి విద్యార్థినిలు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు విద్య బోధనం చేశారు.ఉపాధ్యాయులగా విద్యా బోధనం చేయడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థినిలు తెలిపారు.

## తాడిచెర్లలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**ఉపాధ్యాయులను సన్మానించిన సర్పంచ్ బండి స్వామి**

**మంథని, సెప్టెంబర్ 5: ఉదయం**



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడిచెర్ల గ్రామంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తాడిచెర్ల సర్పంచ్ బండి స్వామి పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించారు. తాడిచెర్ల ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాకేశ్, పద్మజారెడ్డి, నరేష్, మన్యపువాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళిని ఈ సందర్భంగా సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తూ వారి భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని సర్పంచ్ బండి స్వామి పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారి సూచనలు, సలహాలను పాటించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## గురువులకు ఘన సన్మానం

**ముత్తారం సెప్టెంబర్ 05(ఉదయం ప్రతినిధి):**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముత్తారం మండలం పోతారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయులను గ్రామ సర్పంచ్ ఉట్ల చరణ్ శనివారం ఘనంగా సన్మానించారు.ముందుగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని సర్పంచ్ ఉట్ల చరణ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెత్తెట్ల మహేందర్,ఉప సర్పంచ్ తుదూరి శారద నరేందర్,గ్రామస్థులు చల్ల లింగయ్య,కట్ల హరీష్,బత్తుల వేణు,తుదూరి శ్రీనివాస్,ఉట్ల సిద్ధార్థ,శేఖర్, భయ్యా అవినాష్ పాల్గొన్నారు.

## లిటిల్ జీనియస్ హైస్కూల్ లో టీచర్ డే వేడుకలు...




**కోరుట్ల సెప్టెంబర్ 05 (ఉదయం ప్రతినిధి)**

భారత దేశ మొదటి ఉపరాష్ట్రపతి రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా లిటిల్ జీనియస్ హైస్కూల్ లో టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో ఉపన్యాసాలతో ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరించారు కొవ్వత్తిలాగా వెలుగుతూ అజ్ఞానాన్ని తొలగించి విద్యార్థుల భవిష్యత్తు కు దారులు చూపుతారని వారి త్యాగాలకు ఏమిచ్చినా వెలకట్టలేనివని ఉపాధ్యాయులను గౌరవించాలని కొనియాడుతూ ఉపాధ్యాయులను సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ప్రైమరీ ప్రిన్సిపాల్ వినోద ప్రీ ప్రైమరీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి డైరెక్టర్ కొత్తరాజు ఉపాధ్యాయులు ప్రమీల సుధాకర్ మహేష్ నరేష్ జీవిత పాల్గొన్నారు

## సంతోష్ మృతదేహానికి పుట్ట మధూకర్ నివాళులు

**మంథని, సెప్టెంబర్ 5:( ఉదయం ప్రతినిధి)**



మంథని పట్టణంలోని పవర్‌హౌస్ కాలనీకి చెందిన శ్రీపతి సంతోష్ మృతి చెందగా, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంతోష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు..

## విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలి




**ప్రభుత్వ విప్ ఆది**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 05 (ఉదయం ప్రతినిధి) :**

విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా అన్నిరంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు, వారిలో మనో వికాసం, సామాజిక విలువలు, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు,జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 37 మందిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులపై అత్యంత ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల బోధనలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతూ వారి ప్రతిభను వెలికితీయాలని చెప్పారు. ఉపాధ్యాయులే విద్యార్థులకు రోల్‌మోడల్స్ అని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధనా విధానం విద్యార్థులపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. విద్యార్థి ఇష్టపడే ఉపాధ్యాయుడు బోధించే సబ్జెక్టుపై కూడా ఆసక్తి పెంచుకుంటాడని తెలిపారు. ప్రతి విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు సమర్థంగా విధులు నిర్వర్తించి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించారని అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా విద్యాధికారి మొండయ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఇసుక రీచ్‌లపై డీఎల్ఎస్సీ సమీక్ష

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 05 (ఉదయం ప్రతినిధి) :**



జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనులు, నిర్మాణాలు, వాణిజ్య అవసరాలకు ఇసుక కొరత లేకుండా నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్సీ) సమావేశం నిర్వహించారు, నూతన ఇసుక రీచ్‌ల గుర్తింపులో భాగంగా మైనింగ్, నీటిపారుదల, భూగర్భజలాలు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు ఇప్పటికే పలు ప్రాంతాలను పరిశీలించారు, ఆయా ప్రాంతాల్లో చేపట్టిన పరిశీలనల వివరాలను సమావేశంలో సమీక్షించారు.ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలకు అనుగుణంగా నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఈసమావేశంలో టీజీఎండీసీ పీఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతికుమార్, నీటిపారుదల శాఖ అధికారులు ప్రశాంత్, కిషోర్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్లు మహేష్, మురళి, భూగర్భజల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## హరి అశోక్ కుమార్ కు నంది పురస్కారం

**జగిత్యాల కోరుట్ల సెప్టెంబర్ 05 (ఉదయం ప్రతినిధి)**



జగిత్యాల జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులుగా పిల్లల నిరాధరణకు గురైన వృద్ధులకు విశిష్ట సేవలందిస్తున్న ఇటీవల పొగాకు నియంత్రణకు విశేషంగా కృషి చేస్తూ టుబాకో కంట్రోల్ హీరో అవార్డు పొందిన వివిధ సమాజ సేవలు చేస్తున్న రిటైర్డ్ తహసీల్దార్ న్యాయవాది హరి అశోక్ కుమార్ ను తెలంగాణ సాంస్కృతిక శాఖ సహకారంతో గానకోకిల కళా నికేతన్ జగిత్యాల 34వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నంది పురస్కారం ను ఎమ్మెల్సీ ఎల్ రమణ మాజీ మంత్రి జీవన్ రెడ్డి ల చేతుల మీదుగా అందించి సన్మానించారు శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి జీవన్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ నాగ లక్షి గానకోకిల వ్యవస్థాపక అధ్యక్షులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షులు ఎలగంధుల రవి ప్రధాన కార్యదర్శి పుప్పాల అశోక్ కుమార్ ప్రకటించింది ఇట్టి పురస్కారం ను నేడు సెప్టెంబర్ 4న శుక్రవారం ఉమా శంకర్ గార్డెన్స్ జగిత్యాల పట్టణంలో సాయంత్రం జరిగే వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా హరి అశోక్ కుమార్ కు నంది పురస్కారం ను ప్రధానం చేస్తామని గాన కోకిల కళా నికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎలిగేటి రాజేంద్ర ప్రసాద్ ప్రకటించారు ఈకార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు ఎమ్మెల్సీ ఎల్ రమణ ఎంపి ధర్మపురి అరవింద్ ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాజీ ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి జగిత్యాల ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ లు సమిండ్ల వాణి నాగ లక్షి తదితర జిల్లా ప్రముఖులు పాల్గొంటారని వారు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి నంది పురస్కారాలు అందజేస్తారని తెలిపారు.

# వ్యక్తులపై కాకుండా వ్యవస్థ ఆధారంగా పనిచేసేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- నంబర్లు, ర్యాంకుల కోసం కాకుండా విద్యా ప్రక్రియను బలోపేతం చేయడంపైనే దృష్టి
- ఉపాధ్యాయులు తాము ఆచరిస్తూ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి
- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించిన కలెక్టర్

పెద్దపల్లి, సెప్టెంబర్-05 (వుదయం ప్రతినిధి)



ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి, అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 40 సంవత్సరాల క్రితం ఉన్న విద్యా వ్యవస్థకు, నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన యుగంలోని విద్యా వ్యవస్థకు ఎంతో తేడా ఉందని అన్నారు. వ్యవస్థ చాలా వేగంగా మారుతున్న నేపథ్యంలో మనం కూడా అందుకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని తెలిపారు.గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లాలో వ్యక్తులపై ఆధారపడకుండా, వ్యవస్థ ఆధారంగా పనిచేసేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎవరైనా ఉన్నా, లేకపోయినా వ్యవస్థ బలంగా, సమర్థవంతంగా పనిచేసేలా విధానాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లాలోని పలువురు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులతో నిరంతరం చర్చిస్తూ విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. అందరి సమష్టి కృషి, సహకారంతో వ్యక్తులతో సంబంధం లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించగలిగామని అన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందించారు విద్యార్థుల్లో మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తన పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు.

అనంతరం ఉత్తమ సేవలు అందించిన 58 ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి, అవార్డులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిఎం. షేక్, సెక్టోరియల్ అధికారి, మల్లేశం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి



**దూమల ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

రాజన్న సిరిసిల్ల సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఎస్పీ వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. జీవితానికి అవసరమైన జ్ఞానం, మార్గదర్శకత్వాన్ని ఉపాధ్యాయులు అందిస్తారని పేర్కొన్నారు. గురువులు చూపిన మార్గంలో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. తాను ప్రస్తుతం జిల్లా ఎస్పీ స్థాయికి చేరుకోవడంలో విద్యాబుద్ధులు నేర్పి, సరైన మార్గాన్ని చూపిన గురువుల పాత్ర ఎంతో ఉందని మహేష్ బి.గీతే గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు దిక్సూచిలా నిలిచి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు.విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ వారికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు కష్టపడి తమ లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలో సోషల్ మీడియా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద పరిణామాలు ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బొగ్గు గనుల్లో నిరసన సెగ

**బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

పెద్దపల్లి (రామగుండం) సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)




సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గనులపై నిరసన హోరు మిన్నంటింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆర్జీ–1ఏరియాలోని జిడికే 2,2 ఏ ఇంక్లైన్ ల వద్ద ఈ నిరసన ధర్నా చేపట్టారు. వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు,కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మికులపై జారీ చేసిన ఛార్జ్ షీట్లు, సస్పెన్షన్లు,డిస్మిసల్స్ వెంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.సింగరేణి రికార్డుల్లో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని,కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలను పునరుద్ధరించాలని కోరారు. ఖాళీల ఆధారంగా అర్హులైనకార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని,60 ఏళ్లు దాటిన వారికి బకాయిలతో కూడిన పింఛన్ మంజూరు చేయడంతో పాటు క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి1000 రోజులు గడుస్తున్నాకార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు.

ఎన్నికల సమయంలో ప్రకటించిన 250 గజాల ఇండ్ల స్థలాలు,100 శాతం ఇన్వాలిడేషన్ ఉద్యోగాలు, ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు వంటి వాగ్దానాలను పూర్తిగా విస్మరించి కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ పాలనలో 19,000 మందికి ఉద్యోగాలు కల్పించడమే కాకుండా, మెడికల్ కాలేజీల్లో కార్మికుల పిల్లలకు 5 శాతం కోటా ఇచ్చామని గుర్తుచేశారు.కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వక పోగా,కార్మికులను వేధిస్తూ సస్పెన్షన్లు,ఛార్జ్ షీట్లతో తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికుల హక్కు లను కాలరాస్తే ఊరుకునేది లేదని,పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో మాదాసి రామ్మూర్తి,నూనె కొమరయ్య,ఉప్పులేటి తిరుపతి,మీస రాజు,దూత శేషగిరి,మేకల సమ్మయ్య, మూల విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహిపాల్‌రెడ్డికి ఘన సన్మానం

ముత్తారం సెప్టెంబర్ 05(వుదయం ప్రతినిధి):

పెద్దపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అడవిశ్రీరాంపూర్ జిల్లా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మహిపాల్‌రెడ్డి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శనివారం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు.పాఠశాల చైర్మన్ చిగురు స్రవంతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.విద్యార్థుల అభ్యున్నతికి, విద్యాబోధనలో ఆయన అందిస్తున్న సేవలకు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పాఠశాలకు,గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నిమ్మతి రమేష్,సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో 12 మోటార్ల చోరీ

మంథని సెప్టెంబర్ 5: (వుదయం ప్రతినిధి)



మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో 12 వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. సుమారు రూ.2.50 లక్షల విలువైన మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం యార్డుకు వచ్చిన కార్మికులు తలుపులు ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మార్కెట్ కమిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యార్డులో గతంలోనూ రెండు మోటార్లు చోరీకి గురయ్యాయి. ఆ ఘటనను దృష్టిలో ఉంచుకొని పాలకవర్గం అధికారులు సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న యార్డులో కేవలం రెండు సీసీ కెమెరాలు మాత్రమే ఉండటం, రాత్రివేళ భద్రతా సిబ్బంది లేకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల భద్రత కల్పించాలని కోరుతున్నారు. చోరీ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు యార్డులో రాత్రివేళ నిలిచిన వాహనాలు, సంచరించిన వ్యక్తుల వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# తిప్పాపూర్‌లో కోతుల బెడద

**చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ల వినతి**

వేములవాడ సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :

పట్టణంలోని తిప్పాపూర్ 7, 8వ వార్డుల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ కోరారు,ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ లోకేష్ కు వినతిపత్రం అందజేశారు. కోతులు ఇళ్లలోకి చొరబడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని కౌన్సిలర్లు తెలిపారు,దీంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావడానికి సైతం భయపడుతున్నారని పేర్కొన్నారు,కోతుల సంచారంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని 7, 8వ వార్డుల్లో కోతుల సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు, ప్రత్యేక చర్యలు చేపట్టి కోతులను పట్టుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ను విజ్ఞప్తి చేశారు.

# ' టెట్ 'కు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):




ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించే టెట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో టెట్ పరీక్ష నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు సెంటర్లలో ఈనెల 8న, 9న రెండు రోజులు పరీక్షలు జరుగుతాయన్నారు. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష కాబట్టి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బందులు రాకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, శానిటేషన్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని వైద్య శాఖకు సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బందిని నియమించి చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. పరీక్ష నిర్వహణ సజావుగా సాగేలా ఫ్లయింగ్ స్క్వాడ్లను, అబ్జర్వర్లను నియమించినట్లు పేర్కొన్నారు. శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పరీక్ష నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో చైతన్య జైనీ , వైద్య, పోలీస్, ఎన్పీడీసీఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు...




కోరుట్ల సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో గల కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో భారత మాజీ రాష్ట్రపతి ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు ఈ సందర్భంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతులకు బోధించారు అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తమ అనుభవాలను ఉపాధ్యాయులు తోటి విద్యార్థులతో పంచుకున్నారు ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని విద్యార్థులకు నైతిక విలువలను అందిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఎంత కష్టపడతారో ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నామని విద్యార్థులు తెలిపారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సెలెన్ బారీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదివి తన లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు తల్లిదండ్రులకు గురువులకు తాము చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ బారీ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న జన్మించి గొప్ప విద్యావేత్తగా ఎదిగి ఉపాధ్యాయ వృత్తితో తన ప్రస్థానాన్ని ప్రారంభించారని తెలిపారు తన అసాధారణ ప్రతిభతో దేశ అత్యున్నత పదవైన భారత రాష్ట్రపతి పదవిని చేపట్టి దేశానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు

తన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని ఆయన స్వయంగా సూచించడం ద్వారా ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చారన్నారు ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తన లక్ష్యాన్ని సాధించాలని ఆయన సూచించారు తల్లిదండ్రులు గురువులు శ్రేయోభిలాషుల సహాయ సహకారాలను తీసుకుంటూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సందేశమిచ్చారు పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ బారీ ప్రిన్సిపాల్ సెలెన్ బారీ చైర్మన్ ఎంఏ హాది పాల్గొని ఒక్కరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు అలాగే పాఠశాలలో పని చేస్తున్న బోధన బోధనేతర సిబ్బందిని శాలువాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ బారీ ప్రిన్సిపాల్ సెలెన్ బారీ చైర్మన్ ఎంఏ హాది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చెప్పాలి

**మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్**

మంథని, సెప్టెంబర్ 5: (వుదయం ప్రతినిధి )




ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చెప్పాలి 420 హామీలతో మేనిఫెస్టో రూపొందించి తెలంగాణ ప్రజలకు అంకితమని చెప్పిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. మంథనికి 420 అనే పేరు తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. శనివారం మంథని పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులైనా పట్టించుకోవడం లేదని పుట్ట మధూకర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, మెగా డీఎస్సీ, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, రవాణా సౌకర్యం కల్పిస్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ మెరుగుపరుస్తామని, స్కాలర్‌షిప్‌లు పెంచి సకాలంలో అందిస్తామని పేర్కొన్నప్పటికీ వాటిలో ఎన్ని అమలు చేశారో చెప్పాలని అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల ఏటీఎం భరోసా కార్డు పేరుతో మోసం చేశారని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆ దిశగా తగిన చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్ రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పిన హామీలు అమలు కాలేదన్నారు. మంత్రులు ఉద్యోగాల భర్తీపై ఒక్కొక్కరు ఒక్కో లెక్క చెబుతున్నారని అన్నారు. మంథని ప్రాంతంలో ఐటీ పరిశ్రమలు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న మంథని నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ధన్వాడలోని పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని కోరారు. కాళేశ్వరం ఆలయ అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనుల విషయంలోనూ పుట్ట మధూకర్ తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి పనుల పేరుతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పనుల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కోసమే కొన్ని పనులు చేపడుతున్నారనే ఆరోపణలను ఆయన చేశారు.

కళ్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు. రైతులు, మహిళలు, కార్మికులు, యువత, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. ఇప్పటికైనా ఢిల్లీ రాజకీయాలపై దృష్టి తగ్గించి ప్రజలకు ఇచ్చిన హామీలు, పథకాలను అమలు చేయాలని పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మంథని ప్రజలు ప్రభుత్వ పని తీరును గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ధర్నా**

మెట్‌పల్లి సెప్టెంబర్ 05 (వుదయం విలేకరి)




విద్యార్థులు యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఎన్నికల సమయంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ నియామకాలు చేపడతామని విద్యార్థులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించిందని ఎమ్మెల్యే విమర్శించారు పాలిటెక్నిక్ విద్యార్థులకు విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే జిఓ97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మొండి వైఖరి వీడి విద్యార్థులకు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందడం లేదన్నారు వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిఓ 97ను రద్దు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు యువత విద్యార్థులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ధర్మపురి పట్టణ రజక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ధర్మపురి,సెప్టెంబర్ 5(వుదయం ప్రతినిధి):

ధర్మపురి పట్టణ రజక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శని వారం స్థానికంగా నిర్వహించిన సమా వేశంలో సంఘ సభ్యులంతా ఏకాభి ప్రాయంతో నూతన ప్రతినిధు లను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు గుండారపు నర్స య్య ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.గౌరవ అధ్య క్షులు గుండారపు నర్సయ్య,గుండార పు.అర్జన్న అధ్యక్షుడు కొనపర్తి.రాజేం దర్,ప్రధాన కార్యదర్శి బండపల్లి.సత్య నారాయణ,ఉపాధ్యక్షుడు ఎడమలపె ల్లి తిరుపతి,కోశాధికారి గుండారావు. అర్జున్,సంయుక్త కార్యదర్శులు మురు కుంట్ల రమేష్,తక్కలపల్లి గంగారం,ముఖ్య సలహాదారులు గుడికం దుల రాముని,కాంపెల్లి శంకర్ లీగల్ అడ్వై జర్ సాంబరాజుల కార్తీక్ ఎన్నికయ్యా రు.నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యద ర్శులు కొనపర్తి రాజేందర్, బండ పల్లి సత్యనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు పుష్పమాలలు, శాలు వాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రజక బాంధవుల సమస్యల పరిష్కా రానికి,సంఘం సర్వ తోముఖాభివృద్ధికి ఐక్యతతో కృషి చేస్తామని స్పష్టం చేశా రు. ప్రతి ఒక్కరినీ కలుపుకుని పోతూ స్పష్టమైన కార్యాచర ణతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో రజక సంఘం నాయకులు, సభ్యు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైజింగ్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

కోరుట్ల సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)




కోరుట్ల పట్టణ రకాల పంపు లోపల రైజింగ్ హైస్కూల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు ఉపాధ్యాయులు అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పెంపొందించే వారిని దేశానికి కావలసిన ఇంజనీర్ డాక్టర్ సైంటిస్టు లను తయారు చేసేవారు ఉపాధ్యాయులేనని శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి పిల్లలకు పాఠాలు బోధించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ కుడేల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం (సెప్టెంబర్ 5వ తేదీ) సందర్భంగా ఈ కార్యక్రమం జరుపుకుంటామని తెలిపారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారత రాష్ట్రపతిగా ఉత్తమ ఉపాధ్యాయులుగా దేశానికి సేవలందించారని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కుడేల లికిత డైరెక్టర్లు చిప్ప మోహన్ షహనాజ్ బేగం ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న ఆలయ సన్నిధిలో అన్న ప్రసాదం

మల్యాల మండలం సెప్టెంబర్ 05 ( వుదయం ప్రతినిధి )



జగిత్యాల జిల్లా మల్యాల మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు అంజనేయ స్వామి ఆలయ సన్నిధిలో శనివారం రోజున అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొప్పదండి ఎంఎల్ఏ మేడిపల్లి సత్యం హాజరై వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు , అధికారులు , ట్రస్ట్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# సమస్య చెబితే చాలు.. పరిష్కారం ఖాయం!

**కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్‌కు ప్రజల ప్రశంసలు**

వేములవాడ, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)



: ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ స్పందనకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న వేములవాడ పట్టణ 8వ వార్డు కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్‌ను వార్డు ప్రజలు కొనియాడుతున్నారు,వార్డులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని స్థానిక వార్డు ప్రజలు పేర్కొంటున్నారు, తాజాగా వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకు నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించేందుకు కౌన్సిలర్ శ్రీనివాస్ చొరవ చూపారు,సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు,ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్‌తో పాటు సెస్ ఏఈ సిద్ధార్థ్ కి వార్డు ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.ప్రజల సమస్యే తన సమస్యగా భావిస్తూ పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్ తీరుపై వార్డు ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధ్వజం
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై అధికారులను ప్రశ్నించిన సురేందర్

నాగిరెడ్డిపేట్,వుదయం

వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాటలో భాగంగా శనివారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, కళాశాల విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, అర్హులైన నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, తొలి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు.

వెయ్యి రోజులు గడిచినా హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ధర్మారెడ్డి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా స్థానిక గ్రామ సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వలేదని తహసీల్దార్ బిక్షపతిని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రశ్నించారు. అధికారుల సమన్వయ లోపంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా కార్యక్రమాలు నిర్వహించడం సరికాదన్నారు.ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సురేందర్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా జీపీఓ గంగాధర్‌ను సస్పెండ్ చేయాలని తహసీల్దార్ బిక్షపతిని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.




# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

దండేపల్లి: సెప్టెంబర్ 05(వుదయం విలేకరి)



మంచిర్యాల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఆర్ఓ ఆధ్వర్యంలో దండేపల్లి మండల కేంద్రంలో శనివారం సాంస్కృతిక సారధి కళాకారుల బృందం చేత ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను మరియు వర్షాకాలంలో వచ్చేటటువంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆటపాటల ద్వారా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో నెల్కివెంకటాపూర్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా ఎన్నికైన ముత్యాల శ్రీనివాస్ ను సన్మానిస్తూ మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందాలని మధ్యవర్తులు దళారులు లేకుండా ఇందిరమ్మరాజ్యంలో ప్రజా పాలన ద్వారా గడప గడపకు సంక్షేమ పథకాలు చేరాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆట పాట ద్వారా వివరించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ముల్కల్ల మురళి,లావుడ్యా రమేష్, మామిండ్ల లచ్చన్న,వెల్తూరు పోశం,గొడిసెల కృష్ణ, మిట్టపల్లి సంధ్య,చేగొండ నిరోష,తస్లీమా,మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు గడిపెల్లి సత్యం మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజాధనానికి లెక్క చెప్పాల్సిందే.. కేసీఆర్!

**మాజీ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):

ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసీఆర్ ప్రజలకు జవాబు చెప్పాలని, రాజీనామా చేసి ఇక శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్ చేశారు. ప్రజా పాలన సంబరాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు మేలు చేస్తోందన్నారు. నిరుద్యోగులకు 70 వేలకుపైగా ఉద్యోగాలు, అర్హులకు రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల ఏకకాల రుణమాఫీ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని సోయం బాపూరావు ఆరోపించారు. రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాహిద్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, అడ్డి భోజారెడ్డి, మల్లెపూల నరసయ్య, ఆడే గజేందర్, గంద్రత్ సుజాత, కిజార్ పాషా, గిమ్మ సంతోష్‌రావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బెజ్జూర్ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )

బెజ్జూర్ మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పుట్టికొట్టే కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు శ్రీ రంగనాయక స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడపల్లి మహేష్ తెలిపారు. హోరాహోరిగా ఉట్టి కొట్టే కార్యక్రమం జరగగా గోల్కొండ యువకులు ఉట్టి కొట్టి 5 వేల రూపాయల నగదు గెలుపొందారు. యువకులకు బెజ్జూర్ ఏఎస్ఐ మోహన్ నాయక్, కమిటీ సభ్యుల చేతుల మీదుగా 5 వేల రూపాయల నగదు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొప్పుల రాజును మర్యాదపూర్వకంగా కలిసిన కడమంచి ముత్తయ్య

**గాంధీభవన్‌లో మర్యాదపూర్వక భేటీ..**
**శాలువాతో సన్మానం**

శంకర్ పల్లి , సెప్టెంబర్ 05 (వుదయం)



శనివారం గాంధీభవన్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు కొప్పుల రాజును ఎస్ఎస్సిఎల్ వైస్ ప్రెసిడెంట్ కడమంచి ముత్తయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. అనంతరం కడమంచి ముత్తయ్య కొప్పుల రాజును శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.ఈ సందర్భంగా కడమంచి ముత్తయ్య మాట్లాడుతూ కొప్పుల రాజును మర్యాదపూర్వకంగా కలవడం సంతోషంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొప్పుల రాజుకు శాలువా కప్పి సన్మానించిన అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# జిన్నారం మండల ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు

జిన్నారం 5 సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి)




జిన్నారం మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వావిలాల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఏం రాజిరెడ్డి, బొల్లారం అర్బన్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాల నరసింహారెడ్డి లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అడిషనల్ కలెక్టర్ టిఎల్ సంగీత, డీఈవో రోహిణి చేతులమీదుగా అవార్డును సన్మానాన్ని అందుకున్నారు. విద్యారంగంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గౌరవ సత్కారాలు పొందడంపై ఉపాధ్యాయులు ఇద్దరు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాణుబోతుల కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన కార్మికులు



మంచిర్యాల /రామకృష్ణాపూర్/సెప్టెంబర్ 05(వుదయం ప్రతినిధి)

మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి హరి రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ మణుబోతుల కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘనంగానివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అక్బర్ అలీ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు పెన్షన్‌తో పాటు అనేక హక్కులు సాధించడంలో కొమురయ్య కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ కార్మికుల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో సిరాజుద్దీన్, మండల శ్రీనివాస్, సీతారామారావు, కృష్ణస్వామి, శ్రీధర్‌రావు, డొక్కు శ్రీనివాస్, ఆవుల మల్లమ్మ, వైష్ణవి, రజిత, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



# గురువులే భవిష్యత్ తరాల నిర్మాతలు

**గురుపూజోత్సవంలో బోరంచు శ్రీకాంత్‌రెడ్డి**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):

విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడమే కాకుండా, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దే గురువుల సేవలు సమాజానికి చిరస్మరణీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, లైబ్రరీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, డీఈవో మాధవితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి తొలుత భారత తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్యే పునాది అని, ఆ పునాదిని బలోపేతం చేసే బాధ్యత గురువులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ లక్ష్మణ్, డీఎంవో షేక్ కలీం, డీవైఈవో పార్థసారథి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

శంకర్ పల్లి సెప్టెంబర్ 5 (వుదయం)



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌కు చెందిన మహిళా అభివృద్ధి కేంద్రం, క్లబ్ ఐనా ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రొద్దుటూరు ప్రభుత్వ పాఠశాలలో సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంతో అనుసంధానాన్ని పెంపొందించడం, పాఠశాల విద్యార్థులతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకోవడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా నిర్వాహకులు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మమేకమయ్యారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పలు ఆసక్తికరమైన కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేశారు. విద్యార్థులు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా ప్రోత్సహించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించారు.ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన శుభాకాంక్షల కార్డులను ఉపాధ్యాయులకు అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల కలలు, ఆశలు, విద్యా ప్రయాణాన్ని దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించింది. విద్య అనేది కేవలం తరగతి గదికే పరిమితం కాదని, ఒకరినొకరు అర్థం చేసుకోవడం, అనుభవాలను పంచుకోవడం, సమాజానికి తిరిగి సేవ చేయడం ద్వారా కూడా నిజమైన అభ్యాసం జరుగుతుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.మహిళా అభివృద్ధి కేంద్రం, క్లబ్ ఐనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యత, సమాజంతో అనుసంధానం పట్ల వారి నిబద్ధతకు ప్రతిబింబంగా నిలిచింది. తరగతి గది పరిధిని దాటి విద్యార్థులు పరస్పరం నేర్చుకునేలా, అనుభూతులను పంచుకునేలా, ఆప్యాయతను పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని వినీత, కీర్తి, శిరీష సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో జూనియర్, సీనియర్ క్లబ్ సభ్యుల ఉత్సాహభరితమైన సహకారం కీలకంగా నిలిచింది."అవగాహన నుంచి ఆచరణకు.. ఒక తరం నుంచి మరో తరానికి.. విద్యను మాత్రమే కాదు, అనుభవాలను, ఆశలను, స్ఫూర్తిని పంచుకుంటూ ముందుకు సాగడం" ఈ కార్యక్రమం యొక్క ప్రధాన సందేశంగా నిలిచింది.

# సెప్టెంబర్ 16న కాగజ్ నగర్ మెగా జాబ్ మేళా

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

సెప్టెంబర్ 16 (బుధవారం) ఉ. 9 గం.ల నుండి సా. 5 గం.ల వరకు కాగజ్ నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్ లో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తూ సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగి యువత పెద్ద ఎత్తున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జాబ్ ప్లేసుమెంట్లు పొందవలసిందిగా విజ్ఞప్తి చేశారు.




# విద్యారంగంలో భాష్యం హైస్కూల్‌కు ఘనత

**ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం**

నిర్మల్ జిల్లా 5 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)



విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న భాష్యం హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. ఆయన అంకితభావం, సమర్థవంతమైన నాయకత్వం, విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందుకున్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న ప్రశాంత్‌కు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు ప్రశాంత్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా భాష్యం హైస్కూల్ ప్రెసిడెంట్ పూంద్రు సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ ప్రియా కపిల్, కరస్పాండెంట్ కౌశిక్, ఉపాధ్యాయులు ప్రశాంత్‌కు అభినందనలు తెలిపారు.

# కృష్ణుడి వేషంలో అలరించిన కడమంచి ఆయన్ష్, దేవాన్ష్

గండిపేట్, సెప్టెంబర్ 05 (వుదయం)



కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని గండిపేట్‌లో చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న చిన్న పిల్లలను అందంగా అలంకరించి కృష్ణుడి వేషంలో ముస్తాబు చేశారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఎంతో ముద్దుగా కనిపిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా కడమంచి ఆయన్ష్, కడమంచి దేవాన్ష్ శ్రీకృష్ణుడి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెమలి పింఛం, కిరీటం, సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులను కృష్ణుడి రూపంలో అలంకరించడంతో వేడుకలకు మరింత శోభ వచ్చింది.కృష్ణాష్టమి రోజున చిన్నారులు కృష్ణుడి వేషధారణలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. చిన్నారులు ఉత్సాహంగా, సంతోషంగా కృష్ణుడి వేషధారణలో కనిపించడంతో గండిపేట్‌లో పండుగ వాతావరణం నెలకొంది.చిన్నారుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారుల కృష్ణుడి వేషధారణ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది.

# నిరుపేద నవ వధువు పెళ్లికి లయన్స్ క్లబ్ చేయూత

జన్నారం,సెప్టెంబర్ 5 (వుదయం విలేఖరి)

జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన బిస్కుల రాములు – సరోజ ల కూతురు మానస పెళ్లి శనివారం రోజున ఆ గ్రామంలో నిర్వహించగా జన్నారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదివేల రూపాయలను ఆర్థిక సహాయంగా మానస కు అందించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బండారు మారుతిరాజు,సెక్రటరీ గోలి రామకృష్ణ ,కోశాధికారి రాంసింగ్,ఆర్సీ జక్కు భూమేష్,ఆర్సీ సెక్రటరీ కస్తూరి సతీష్,మల్లికార్జున్, సభ్యులు నరెందుల గోపి, గోలి మణి,విజయ్ కుమార్,వెలగందుల సురేష్,అనుముల రాజన్న, వావిలాల రాజు,మల్లేష్, కొమురవెల్లి సందీప్ పాల్గొన్నారు.




# తాళ్ళపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో విబీజీ రామ్ గ్రామసభ

దండేపల్లి: సెప్టెంబర్ 05 (వుదయం విలేకరి)

మండలములోని తాళ్ళపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుర్సెంగ కళావతి అధ్యక్షతన శనివారం విబిజి రామ్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా విబీజీ రామ్ ద్వారా చేపట్టే ఇంకుడు గుంతల నిర్మాణం మరియు నూతన బావుల తవ్వకాలు, భూగర్భ జలాలు పెంచే నీటి నిల్వలు గూర్చి తీర్మానించారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, పంచాయతీ కార్యదర్శి స్వరూప,మాజీ వైస్ యంపిపి ఆకుల రాజేందర్, టిఏ రాంకుమార్,సీనియర్ మేట్ పద్మ,వార్డు సభ్యులు మాడ సూర్య,ఆత్రం భీంరావు నాయకులు మాడ దయాకర్,రవి గౌడ్, హన్మంతు,జాఫర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# 1000 రోజుల ప్రజా పాలనకు ఘనంగా సంబరాలు



మంచిర్యాల/సెప్టెంబర్ 05(వుదయం ప్రతినిధి)

తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 1000 బైక్‌లతో భారీ ర్యాలీ చేపట్టారు.మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాసం నుంచి ప్రారంభమైన ర్యాలీ బెల్లంపల్లి చౌరస్తా, వెంకటేశ్వర టాకీస్, ఐబీ చౌరస్తా మీదుగా సీసీసీ కార్నర్ చౌరస్తా వరకు ఉత్సాహభరితంగా సాగింది. కాంగ్రెస్ జెండాలతో పెద్ద సంఖ్యలో బైక్‌లపై కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు.కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, వైస్ చైర్మన్ జాలే రాయలింగు, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీపతి మల్లేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతితో పాటు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు, మైనారిటీ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శివాలయ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



**మ్యాక్ సొసైటీ కాలనీలో భక్తిశ్రద్ధలతో శివాలయ శంకుస్థాపన మహోత్సవం**

రామచంద్రపురం సెప్టెంబర్ 5 (వుదయం)

భారతి నగర్ డివిజన్‌లోని మ్యాక్ సొసైటీ కాలనీ లో శ్రీ కనకదుర్గ శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో శనివారం శివాలయ శంకుస్థాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, శివాలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి గారు, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి గారు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, పాటి సత్యనారాయణ, ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మ్యాక్ సొసైటీ ఆలయ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులు నందగోపాల్, సత్యనారాయణ,యాదగిరి, సుధాకర్, సంతోష్, విజయ్, నరసింహ, శ్రీధర్, సాయి, భాను తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# శివాలయంలో భక్తుల పూజలు

ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )

బెజ్జూర్ మండల కేంద్రంలోని శివాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని శివాలయంలో నిత్యభిషేకం ఆలయ ప్రధాన అర్చకులు గురు దత్ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన, అన్నభిషేకం శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేసి రకరకాల పువ్వులతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రంగనాయక స్వామి, వీర హనుమాన్, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో ఇక్కామా (భక్తి పాటలతో భజన కార్యక్రమం) కార్యక్రమం 24 గంటల పాటు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడి పల్లి మహేష్, కనుకుట్ల వెంకటేష్ దంపతులు, కనుకుంట్ల శ్రీనివాస్ దంపతులు, శ్రీరామ చంద్రశేఖర్ దంపతులు, కోంద్ర నరేందర్ గౌడ్ దంపతులు, పడాల సదాశివ్ దంపతులు, పడాల గణేష్ దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఎన్ఎఫ్డీబీ హైదరాబాద్ నిర్వహించిన శిక్షణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ




**కామారెడ్డి, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):-**

ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని జూలజీ అండ్ ఫిషరీస్ విభాగానికి చెందిన విద్యార్థిని శ్రీహరి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (NFDB), హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల హాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ శిక్షణలో విద్యార్థిని చురుకుగా పాల్గొని, ప్రాక్టికల్ అంశాలపై మంచి అవగాహనను ప్రదర్శించారు. శిక్షణలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు కళాశాల ప్రిన్సిపల్ డా. కె. విజయ్ కుమార్ విద్యార్థినిని అభినందించి సన్మానించారు. విద్యార్థులు ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ డా. కిష్టయ్య, జూలజీ అండ్ ఫిషరీస్ విభాగం హెడ్ డా. మల్సూర్ తిరుమల, పవన్ కుమార్, మైత్రి, రాజేశ్వర్, ప్రత్యూష తదితరులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

## 10 కి.మీ. ట్రాఫిక్.. రంగంలోకి ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**మూడు గంటలు ఎండలో నిలిచి వాహనదారులకు ఊరట**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):**

నెరడిగొండ మండలం కుప్టి బ్రిడ్జి సమస్యతో బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి ఇచ్చోడ వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర నిలిచి పోయిన భారీ వాహనాల వద్దకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వయంగా చేరుకున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి మూడు గంటల పాటు ఎండలోనే ఉండి ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక మార్గాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యాలే తనకు ముఖ్యమన్నారు. హైవేపై టోల్ వసూలు చేస్తున్నా రహదారి సౌకర్యాలు మెరుగుపడటం లేదని విమర్శించారు. కుప్టి బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే రహదారి దిగ్బంధం చేపడతామని హెచ్చరించారు.

## దోమకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- గణేష్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలి.. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర




**కామారెడ్డి, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):-**

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర దోమకొండ పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రతిరోజూ అధికారులకు తెలియజేస్తున్న సూచనలు, అంశాలు సిబ్బందికి చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా సిబ్బందిని ప్రశ్నించి వారి అవగాహనను తెలుసుకున్నారు. ప్రజలతో వ్యవహరించే విధానం, ఫిర్యాదులపై స్పందన, నేర నియంత్రణ చర్యలు, స్టేషన్‌లో విధుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ తెలియజేసిన ప్రతి సూచనను సిబ్బంది క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరు, నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని సమస్యను పూర్తిగా విని, సత్వర స్పందన అందిస్తూ చట్టపరమైన పరిష్కారం చూపాలని సూచించారు. దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల తీరుతో పాటు పెండింగ్ కేసులు, గ్రేవ్ కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసులు, వారెంట్ల అమలు, బీట్ వ్యవస్థ తదితర అంశాలపై ఎస్పీ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తుతో పాటు సాంకేతిక ఆధారాల సేకరణ, సాక్ష్యాల పరిరక్షణ, సాక్షుల వివరాల నమోదు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బాధితుల సమస్యలను సున్నితంగా పరిష్కరించాలని, మహిళలు, బాలలపై నేరాల విషయంలో SOP ప్రకారం నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని, రాత్రి వేళల్లో గస్తీని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్‌తో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాలు, మహిళలు, బాలల భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సూచించారు.

రాబోయే గణేష్ పండుగను పురస్కరించుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, భిక్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, దోమకొండ ఎస్ఐ ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం స్వాధీనం



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

బెజ్జూర్ మండలంలోని పోతేపల్లి గ్రామంలో యాద వెంకటేష్ ఇంటి వద్ద పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎం.డి. సర్దార్ పాషా వెంటనే తన సిబ్బందితో కలసి పోతేపల్లి గ్రామానికి చేరుకుని, నిందితుడు నివాసంలోని తనిఖీల్లో సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 20 పాలిథిన్ సంచుల్లో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.12వేలుగా అంచనా వేశారు. అనంతరం నిందితుడు యాద వెంకటేష్‌ను మరియు స్వాధీనం చేసుకున్న బియ్యంతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించి ఈ ఘటనపై ఎస్ఐ ఎం.డి. సర్దార్ పాషా కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం.. యువతను ఏకం చేద్దాం

**బద్దం పోతారెడ్డి జన్మదిన వేడుకల్లో ఆడే గజేందర్**



**బోథ్, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):**

బోథ్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయడంలో యువత పాత్ర కీలకమని, యువతను ఏకం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి జన్మదిన వేడుకల్లో ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేయించారు. అనంతరం బద్దం పోతారెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. యువత పార్టీ కోసం చురుగ్గా పనిచేయాలని, SIR వంటి కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉంటూ ప్రజా సమస్యలపై ముందుండాలని సూచించారు. బద్దం పోతారెడ్డి మాట్లాడుతూ.. తన జన్మదిన వేడుకలు నిర్వహించిన ఆడే గజేందర్, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి యువతను ఏకం చేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మ మహేందర్, ఆత్మ కమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్, గొర్ల రాజు యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీకర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ రషీద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ గంజాయి సాగుపై పోలీసుల దాడి

- మూడు కేసు లలో 460 గంజాయి మొక్కలు స్వాధీనం, వేర్వేరు కేసు లలో నల్గురు నిందితులు అరెస్ట్
- గంజాయి సాగు,అక్రమ రవాణా, నిల్వకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు – జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి):**

సిర్పూర్ (యు) మండలంలోని బుర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిషేధిత గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ నితికా పంత్,పోలీసు అధికారులు, సిబ్బందితో బుగ్రామపంచాయతీ పరిధిలోని జీడిఘాట్,గుట్టగూడ గ్రామా శివారులలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టగా,అక్కడ అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలు గుర్తించారు. దీంతో పోలీసులు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని,గంజాయి సాగుకు పాల్పడుతున్న మూడు వేర్వేరు కేసులలో మొత్తం నల్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ కాబడిన నిందితుల వివరాలు గెడం లోబాజీ , గెడం జయవంత్ , బూర్నూర్ గ్రామ పంచాయతీ లోని జీడిఘాట్ నివాసులు కుమ్రా మాధవరావు, బూర్నూర్ గ్రామ పంచాయతీ లోని జీడిఘాట్ నివాసుడు, పెండోర్ సూర్యభాను, గుట్టగూడ గ్రామస్తుడు గా పోలీసులు గుర్తించారు,నిందితులు వారి వ్యవసాయ భూమిలలో సాగు చేస్తున్న మొక్కలను పోలీసు వారు గుర్తించారు. ఈ ఘటనలలో నిందితుల పై పోలీసు వారు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి సాగుకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

గంజాయి సాగు చేసినా, గంజాయిని అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా లేదా అక్రమ కార్యకలాపాలకు సహకరించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు లేదా మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలను కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా,తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ గంజాయి సాగు మరియు రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారని జిల్లా ఎస్పీ తెలపారు.

## 2-ఏ భూముల సమస్యపై 'చలో ఇందిరాపార్క్'

- రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించాలి
- ఎమ్మెల్యే పాయల్ శంకర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):**

22-ఏ భూముల జాబితా నుంచి అర్హులైన రైతుల భూములను తొలగించి, వారికి సంపూర్ణ హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'చలో ఇందిరాపార్క్' కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22-ఏ భూముల సమస్యతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూములు 22-ఏ జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు తదితర అంశాల్లో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీలోనూ గళమెత్తుతాం**

22-ఏ భూముల సమస్యను ఇక్కడితో వదిలిపెట్టేది లేదని పాయల్ శంకర్ స్పష్టం చేశారు. ఎల్లుండి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేలంతా ఈ అంశంపై పెద్దఎత్తున పోరాటం చేస్తారని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించి రైతుల తరఫున బలంగా తమ వాణిని వినిపిస్తామని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు అసెంబ్లీ వేదికగా కూడా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతుల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, వారికి సంపూర్ణ హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా దర్గా ఉత్సవాలు

**నాగిరెడ్డిపేట,వుదయం**



నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో పీరానే పీర్ గౌసే ఆజం దస్తగీర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ దర్గా ఉత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా నిర్వహించారు. ఖాన్‌ఖాయే ఆబిదుల్ హాష్మీ పీఠాధిపతి హజ్రత్ ముహమ్మద్ షరీఫోద్దీన్ షత్తారీ ఉల్ ఖాద్రీ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఖురాన్ పఠనంతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం దర్గా వద్ద గంధం, చాదర్‌లను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఖవ్వాలీ కార్యక్రమం భక్తులను అలరించింది. కులమతాలకు అతీతంగా నిర్వహించిన ఈ ఉర్సు ఉత్సవాలకు నాగిరెడ్డిపేట్ మండలంతో పాటు ఎల్లారెడ్డి, లింగంపేట్, నిజాంసాగర్, పిట్లం, మెదక్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సంగారెడ్డి జిల్లా అన్నాసాగర్ ఖాన్‌ఖాయే హాష్మీ దర్గా జనషిన్ హజ్రత్ సూఫీ షా మొహమ్మద్ హుస్సేన్ షత్తారీ ఉల్ ఖాద్రీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుట్లకు చెందిన సూఫీ హబీబ్ హుస్సేన్ షత్తారీ ఉల్ ఖాద్రీ, మాక్లూర్ పీఠాధిపతి సూఫీ సయ్యద్ ఎహెసాన్ అలీ, మహ్మద్ అబ్దుల్ కరీం షత్తారీ ఉల్ ఖాద్రీ, సూఫీ మహ్మద్ అబ్దుల్ రషీద్ షత్తారీ ఉల్ ఖాద్రీ, మహ్మద్ అబ్దుల్ వజాహత్, మహ్మద్ ఖాజా మియా, మండల నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## దీక్ష జూనియర్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**నిర్మల్ జిల్లా**
**5 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**



దీక్ష జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యను బోధించడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన వంటి అంశాలను విద్యార్థులకు నేర్పిస్తూ ఉపాధ్యాయులు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ
ఉపాధ్యాయ దినోత్సవం గురువుల సేవలను స్మరించుకునే గొప్ప సందర్భమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ ప్రమోద్‌రావు మాట్లాడుతూ
విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారిని సరైన మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల విజయమే ఉపాధ్యాయులకు లభించే అసలైన గౌరవమని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఉపాధ్యాయులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపల్లిలో ఘనంగా వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

**నిజాంసాగర్ సెప్టెంబర్ 05(వుదయం ప్రతినిధి):**



పోతిరెడ్డిపల్లిలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో 13వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్సవంలో భాగంగా శ్రీ వీరాంజనేయ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడంతో పాటు లక్షా 11 వేల తమలపాకులతో అర్చన చేపట్టారు. అదేవిధంగా ఆలయంలోని శివుడికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి 2 లక్షల 11 వేల ఏక బిల్వపత్రాలతో ప్రత్యేక అర్చన చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తుల కోసం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. ఈ కార్యక్రమం ఆలయ నిర్వాహకులు తేజ, ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యుత్ షాక్ తో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి

**జన్నారం, సెప్టెంబర్ 5 (వుదయం విలేఖరి)**



జన్నారం గ్రామానికి చెందిన మహ్మద్ వలియోద్దీన్ (45) విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం.. వలీమోద్దీన్ వృత్తిరీత్యా ప్రైవేటు ఎలక్ట్రిషన్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం రోజున ఆయన నీటి బావి మోటార్ ను రిపేర్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు,ఒక కుమార్తె ఉన్నారు.అందరితో కలివిడిగా ఉండే ఆయన మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.



## కుక్కలు,కోతుల బెడద నుండి కాపాడండి

**దండేపల్లి గ్రామ కార్యదర్శికి వినతి**

**దండేపల్లి: సెప్టెంబర్ 05 (వుదయం విలేకరి)**

దండేపల్లి మండల కేంద్రంలో వీధి కుక్కలు,కోతుల బెడద ఎక్కువైందని ఇటీవల చాలా మంది కుక్క కాటుకు గురై ఆసుపత్రి పాలయ్యారని ఈ నెల మూడవ తేదీన ఒరుగంటి పోషం (80) అనే వృద్ధుని పై ఐదు వీధి కుక్కలు దాడి చేసి ప్రాణాలు తీశాయని మరియు కోతులు ఇళ్లలోకి చొరబడి వస్తువులు తీసుకెళ్లడమే కాకుండా దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇక పై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి హరీష్ కు వినతి పత్రం అందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వర్ నాయక్,సహకార సంఘం అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.




## గురువుకు ఘన సన్మానం.. గురుభక్తి కున్న జై మీడియా అధినేత

**దండేపల్లి: సెప్టెంబర్ 05 (వుదయం విలేకరి)**

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ లోని స్వాతి స్కూల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న నరేందర్, అనంతరం హైదరాబాద్ కు వెళ్లి అంచెలంచెలుగా ఎదుగుతూ జై మీడియా అధినేతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు అప్పాల మనోహర్ దండేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న నరేందర్ దండేపల్లి కి వచ్చి గురువుకు శాలువా కప్పి,సత్కరించి తన గురుభక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ తన జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి తన గురువులు అందించిన విద్య,క్రమశిక్షణ, విలువలు ఎంతో దోహదపడ్డాయని అన్నారు. తాను ఎంత ఎదిగినా తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరచిపోనని తెలిపారు. గురువు చూపిన మార్గంలో నడిచి అంచెలంచెలుగా ఎదిగిన శిష్యున్ని తిరిగి సన్మానించడం గురు శిష్యుల బంధానికి ప్రతీకగా నిలిచింది.

## వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ఠ చర్యలు




- ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్. వై. గిరి

**కామారెడ్డి, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):-**

వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజల భద్రత, మత సామరస్యం కాపాడేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్. వై. గిరి అధికారులను ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాలు సెప్టెంబర్ 14 నుంచి 24వ తేదీ వరకు, విగ్రహాల నిమజ్జనం సెప్టెంబర్ 24న నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో నీటి లోతును ముందుగానే గుర్తించి, ప్రమాదాలు జరగకుండా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాలని, మైక్ అనుమతులు కూడా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనుమతించిన సమయానికి మించి ధ్వని వ్యవస్థలను వినియోగించరాదని, ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రార్థనా స్థలాల సమీపంలో అధిక శబ్దంతో మైక్‌లు వినియోగించకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రొఫెషనల్ ఈతగాళ్లు, పడవలు, రక్షణ జాకెట్లు అందుబాటులో ఉంచాలని, వైద్య బృందాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది, వాహనాలను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

నిమజ్జనం రోజున శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిబంధనల మేరకు మద్యం విక్రయాలపై నిషేధాజ్ఞలు అమలు చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి మరియు పర్యావరణహిత వినాయక విగ్రహాలను వినియోగించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్. వై. గిరి కోరారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఏవైనా అత్యవసర సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులు ఏర్పాటు చేసే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్ హిమబిందు, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కొమురం భీం విగ్రహానికి భూమి పూజ

**పనులు ప్రారంభించిన తెలంగాణ గిరిజన ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి**

**దండేపల్లి: సెప్టెంబర్ 05 (వుదయం విలేకరి)**




మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కొమురం భీం విగ్రహానికి శనివారం భూమి పూజ చేశారు తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదం తో గిరిజన హక్కుల కోసం పోరాటం చేసిన ఆదివాసి ముద్దు బిడ్డ కొమురం భీం అని అన్నారు ఆ మహనీయుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఆయనకు ఇచ్చిన నిజమైన గౌరవం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్జిపిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి,సర్పంచ్ అజ్మీర రాజేశ్వర్ నాయక్,ఉప సర్పంచ్ సిరికొండ నవీన్, కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సృజన్,ఆకుల దుర్గ ప్రసాద్,కొంగల నవీన్, అదివాసీ నాయకులు పెంద్రం శ్రీనివాస్,రాజు,కుడిమెత సోము పాల్గొన్నారు.

## సంక్షేమమే ఎజెండా.. అభివృద్ధే లక్ష్యం



- డీసీసీ అధ్యక్షుడు నరేశ్ జాదవ్
- కాంగ్రెస్ పాలనకు 1,000 రోజులు.. హోరెత్తిన బైక్ ర్యాలీ

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదిలాబాద్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు డా. నరేశ్ జాదవ్ నేతృత్వంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. కోమురం భీమ్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌక్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో నరేశ్ జాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి సంక్షేమమే ఎజెండా, అభివృద్ధే లక్ష్యమన్నారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలకు మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని నరేశ్ జాదవ్ డిమాండ్ చేశారు. రాజకీయ చర్చలు వ్యక్తిగత విమర్శలకు పరిమితం కాకుండా రైతులు, నిరుద్యోగం, సంక్షేమం, అభివృద్ధి వంటి ప్రజా సమస్యలపై జరగాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై కూడా ఆయన విమర్శలు చేశారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యల పరిష్కారంపై కేంద్రం దృష్టి సారించాలని కోరారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.